VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : ఆదివారం 07.06.2026

సంపుటి : 07 సంచిక : 363 , పేజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com



2

నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ (NAC)కు జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక గుర్తింపు

# కోహెడ అంతర్జాతీయ సమీకృత ఫ్రూట్ మార్కెట్

# తెలంగాణ వ్యవసాయ రంగానికి కొత్త దిశ





## రైతుల ఆదాయ వృద్ధి, వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులే ప్రభుత్వ లక్ష్యం: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా వెలుతురు జూన్ 06:**

శనివారం సాయంత్రం కోహెడ లో అంతర్జాతీయ సమీకృత ఫ్రూట్ మార్కెట్ నిర్మాణానికి,ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ కాంప్లెక్స్ కు గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసారు.

శంకుస్థాపన కార్యక్రమంలో ఎంపీ లు వేం నరేందర్ రెడ్డి,చామల కిరణ్ కుమార్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు,శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎంఎల్ ఏ లు మల్ రెడ్డి రంగా రెడ్డి , వీర్లపల్లి శంకరయ్య, నవీన్ యాదవ్ ,కసిరెడ్డి నారాయణ రెడ్డి, జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్లు చంద్రా రెడ్డి, కిరణ్మయి, గడ్డిఅన్నారం మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు , తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా కోహెడలో అంతర్జాతీయ సమీకృత ఫ్రూట్ మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ వ్యవసాయ రంగాన్ని ఆధునీక రించడంతో పాటు రైతులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

గతంలో రైతులు పండించిన పండ్లు, కూరగాయలు, పాలు హైదరాబాద్ నగర ప్రజల అవసరాలను తీర్చేవని, అయితే పట్టణీకరణ మరియు రియల్ ఎస్టేట్ విస్తరణ కారణంగా వ్యవసాయ భూముల విస్తీర్ణం తగ్గిందన్నారు. ప్రస్తుతం కోటి ముప్పై లక్షలకు పైగా జనాభా కలిగిన హైదరాబాద్ అంతర్జాతీయ నగరంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఆహార అవసరాలను తీర్చేందుకు ఆధునిక వ్యవసాయ మౌలిక వసతులు అవసరమని తెలిపారు.

గతంలో తాత్కాలిక షెడ్లలో నిర్వహించిన మార్కెట్‌లో ప్రమాదాలు చోటుచేసుకున్నాయని గుర్తు చేస్తూ, రైతులకు భద్రతతో కూడిన అంతర్జాతీయ ప్రమాణాల మార్కెట్‌ను ఏర్పాటు చేస్తామన్న హామీ మేరకు 240 ఎకరాల్లో ఆధునిక ఫ్రూట్ మార్కెట్‌ను నిర్మిస్తున్నామని చెప్పారు.

▶ మిగతా 2లో



## చేప ప్రసాదం పంపిణీ ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలి

- మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తో కలిసి ఏర్పాట్లు పరిశీలన
- రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ వెలుతురు జూన్ 06:**

మృగశిర కార్తె సందర్భంగా చేప ప్రసాదం స్వీకరించేందుకు దేశ నలుమూలల నుండి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉన్నందున ప్రభుత్వం తరపున చేసే ఏర్పాట్లను పకడ్బందీగా ఉండేలా అన్ని శాఖలు సమన్వయంతో కలిసి పని చేయాలని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈనెల 8 వ తేదీ మృగశిర కార్తె సందర్భంగా అస్తమా వ్యాధిగ్రస్తులకు వేసే చేప ప్రసాదం పంపిణీ పై నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో ఏర్పాట్లను సహచర మంత్రులు వాకిటి శ్రీహరి, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, షాట్ చైర్మన్ శివసేనారెడ్డి లతో కలసి అన్ని ప్రాంతాలను క్షుణ్ణంగా పర్యవేక్షించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

▶ మిగతా 2లో

# జంతర్‌మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ నిరసనలు

- నీట్ పేపర్ లీక్, సీబీఎస్ఈ అవకతవకలపై యువత ఆగ్రహం
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ నినాదాలు
- "లీక్ ఇన్ ఇండియా" అంటూ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు
- బోస్టన్ నుంచి ఢిల్లీకి వచ్చిన CJP వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే
- వేలాదిగా తరలివచ్చిన యువతతో జంతర్‌మంతర్ ఉద్రిక్తం
- ఢిల్లీ పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు



- ఛత్రపతి శంబాజీనగర్‌లో కూడా భద్రతా మోహరింపు
- నిరసనలకు ముందే అనుమతి ఇచ్చిన ఢిల్లీ పోలీసులు
- సోనమ్ వాంగ్‌చుక్ మద్దతు, నిరాహార దీక్ష హెచ్చరిక

▶ మిగతా 2లో



## ఐరాస వేదికపై భారత్-పాక్ మధ్య మాటల యుద్ధం

- జమ్మూకశ్మీర్ వ్యాఖ్యలపై పాక్‌కు భారత్ ఘాటు సమాధానం
- ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో ఉద్రిక్త వాతావరణం
- అంతర్గత వ్యవహారాల్లో జోక్యం అంగీకరించబోమని భారత్ స్పష్టం

▶ మిగతా 3లో

## మహిళా భవనాల నిర్మాణ పనుల పురోగతిని ప్రతిరోజూ నేనే పరిశీలిస్తా- మంత్రి సీతక్క

- రోజు వీసీలతో పనుల సమీక్ష.. అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు
- ఉపాధి హామీ పనులు, మహిళా సమాఖ్య భవనాల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, సెర్ప్ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి సీతక్క



**హైదరాబాద్, వెలుతురు జూన్ 6:**

గ్రామాల్లో నిర్మిస్తున్న మహిళా భవనాల నిర్మాణ పనుల పురోగతిని ప్రతి రోజూ తాను పరిశీలిస్తానని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. భవనాల నిర్మాణ పురోగతిపై రోజువారీగా వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు. ఉపాధి హామీ పనులు, గ్రామ మహిళా సమాఖ్య భవనాల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు.

▶ మిగతా 2లో

# నీట్ వైఫల్యం, ధరల పెంపుపై కేంద్రంపై మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర విమర్శలు

- విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్రం చెలగాటమాడుతోందని ఆగ్రహం
- పరీక్ష రద్దు కేంద్ర వైఫల్యానికి నిదర్శనమని వ్యాఖ్య
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్
- లక్షలాది విద్యార్థులు రోడ్డున పడే పరిస్థితి దాపురించిందని విమర్శ
- నెలల కష్టాన్ని ప్రభుత్వ నిర్లక్ష్యం వృథా చేసిందని ఆవేదన
- దేశ భద్రతపై కేంద్రం ఉదాసీనత




చూపుతోందని ఆరోపణ

- విద్యార్థుల కుటుంబాలకు కాంగ్రెస్ అండగా ఉంటుందని భరోసా
- సీఎం రేవంత్ రెడ్డి పాలనలో విద్యకు ప్రత్యేక ప్రాధాన్యం

▶ మిగతా 5లో

# రేవంత్ సర్కార్‌పై కవిత తీవ్ర ఆరోపణలు

- రూ.లక్ష కోట్ల ప్రభుత్వ భూమి పెద్దలకు కేటాయిస్తున్నారని విమర్శ
- భూదందాలో సీఎం కుటుంబ సభ్యుల ప్రమేయం ఉందని వ్యాఖ్య
- హైడ్రా చర్యలు పేదలపై లక్ష్యంగా ఉన్నాయని ఆరోపణ
- సుప్రీంకోర్టు వరకు వెళ్లి భూములు కాపాడుతామని హెచ్చరిక
- శ్రీ ఆదిత్య కంపెనీ ప్రాజెక్టుపై ఎంపీ ప్రమేయం ఉందని వ్యాఖ్య
- జలవనరుల అంశంలో ప్రభుత్వంపై విమర్శల వర్షం



- మహారాష్ట్ర, ఏపీ నీటి వ్యవహారాలపై రేవంత్‌పై ప్రశ్నలు
- పవన్ కల్యాణ్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేసిన కవిత
- తెలంగాణ జాగీర్ కాదని, రాజకీయ జోక్యాన్ని సహించమని హెచ్చరిక

**హైదరాబాద్ వెలుతురు జూన్ 06:**

కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. శనివారం మీడియాతో మాట్లాడిన ఆమె, రేవంత్ రెడ్డి సర్కార్‌పై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. ప్రభుత్వ పెద్దలకు రూ.లక్ష కోట్ల విలువైన భూములు అప్పగిస్తున్నారని, ఇందులో సీఎం కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా ఉన్నారని ఆమె ఆరోపించారు.

▶ మిగతా 2లో

# సెమీ కండక్టర్ పరిశ్రమలకు తెలంగాణ అనుకూలం

- ఇక్కడ పెట్టుబడులు పెట్టేలా మలేషియా కంపెనీలను ప్రోత్సహించండి
- భవిష్యత్తు అవసరాలు, సవాళ్లను ఎదుర్కొనేలా 'ఎకో సిస్టం' అభివృద్ధి
- మలేషియా అత్యున్నత స్థాయి బృందం భేటీలో మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్ వెలుతురు జూన్ 06:**

సెమీకండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ అత్యంత అనుకూలమని... ఇక్కడ పెట్టుబడులు పెట్టేలా మలేషియా కంపెనీలను ప్రోత్సహించాలని ఆ దేశ ప్రతినిధుల బృందాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా, రాబోయే రోజుల్లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేలా ప్రపంచస్థాయి సదుపాయాలతో కూడిన సెమీ కండక్టర్ 'ఎకో సిస్టం'ను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. మలేషియా – పెనాంగ్ డిప్యూటీ సీఎం వైబీ జగదీప్ సింగ్ దియో నేతృత్వంలోని ఆ దేశ అత్యున్నత స్థాయి ప్రతినిధుల బృందం శనివారం డా. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసింది.

'తెలంగాణ– మలేషియా(పెనాంగ్)' మధ్య సెమీ కండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీ, ఏఐ, ఇన్నోవేషన్స్, హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ తదితర రంగాల్లో పరస్పర సహకారానికి గల అవకాశాలపై ప్రత్యేకంగా చర్చించారు. చిప్ డిజైన్, ఎలక్ట్రానిక్స్, అధునాతన సాంకేతిక రంగాల్లో హైదరాబాద్ అంతర్జాతీయ కేంద్రంగా ఎదుగుతోందని ఈ



సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. సెమీ కండక్టర్స్, ఎలక్ట్రానిక్స్ తయారీ, అడ్వాన్స్డ్ మ్యానుఫ్యాక్చరింగ్, ఎమర్జింగ్ టెక్నాలజీస్, లైఫ్ సైన్సెస్, బయో టెక్నాలజీ, క్లీన్ ఎనర్జీ, ఏరో స్పేస్, డిఫెన్స్, ప్రెసిషన్ ఇంజినీరింగ్ తదితర రంగాల్లో తెలంగాణలో అపార అవకాశాలు ఉన్నాయన్నారు. 'గ్లోబల్ ఇన్వెస్ట్ మెంట్ డెస్టినేషన్'గా తెలంగాణను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున తీసుకుంటున్న చర్యలను వివరించారు. తెలంగాణ ను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా తీర్చిదిద్దేందుకు అంతర్జాతీయ భాగస్వామ్యాలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. సెమీకండక్టర్ అసెంబ్లీ, టెస్టింగ్, ప్యాకేజింగ్ రంగాల్లో పెనాంగ్‌కు ఉన్న అనుభవం... గ్లోబల్ సెమీకండక్టర్ హబ్‌గా తెలంగాణ ఎదిగేందుకు ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

"తెలంగాణ లాంటి ప్రగతిశీల రాష్ట్రంతో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఉన్నాం. ఇరు ప్రాంతాల మధ్య పరస్పర సహకారాన్ని బలోపేతం చేసేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుని ముందుకెళ్తాం" అని వైబీ జగదీప్ సింగ్ దియో పేర్కొన్నారు.

# నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్

**హైదరాబాద్ వెలుతురు జూన్ 06:**

నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ (NAC)కు "నిర్మాణ రంగంలో ఉత్తమ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం" విభాగంలో ప్రతిష్ఠాత్మక ప్లాటినం అవార్డు లభించిన సందర్భంగా, అలాగే NAC డైరెక్టర్ జనరల్, CE (R&B) QC శ్రీ ఎం. శ్రీనివాస రెడ్డి గారికి ISDA ఇన్‌ఫ్రాకాన్ నేషనల్ అవార్డ్స్ (IINA–2026) లో ప్రభుత్వం సేవలో R&B విభాగంలో అత్యుత్తమ ప్రదర్శనకు గోల్డ్ అవార్డు దక్కిన సందర్భంగా, రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిసి ఈ విజయాలను పంచుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు NAC బృందాన్ని మరియు శ్రీ ఎం. శ్రీనివాస రెడ్డి గారిని అభినందిస్తూ, నిర్మాణ రంగంలో నైపుణ్యాభివృద్ధి, యువతకు ఉపాధి కల్పన, నాణ్యమైన శిక్షణ కార్యక్రమాల అమలులో NAC చేస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు.

తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణలు అందించి ఉపాధి అవకాశాలు కల్పించడంలో NAC కీలక పాత్ర పోషిస్తోందని, 2025–26 సంవత్సరంలో 21,016 మందికి వివిధ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విజయమని మంత్రి అన్నారు. భవిష్యత్తులో కూడా రాష్ట్ర యువతకు మరింత మెరుగైన శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా NAC ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

న్యూఢిల్లీలో జూన్ 5న ప్రదానం చేసిన ఈ అవార్డులు తెలంగాణ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి రంగానికి దక్కిన గౌరవంగా మంత్రి పేర్కొన్నారు.

# రేవంత్ సర్కార్‌పై...

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ భూములను కాపాడేందుకు అవసరమైతే సుప్రీంకోర్టు వరకు వెళ్తామని కవిత స్పష్టం చేశారు. హైడ్రా చర్యలు పేదల కాలనీలపై మాత్రమే దృష్టి సారిస్తున్నాయని, అదే సమయంలో పెద్దలకు భూములు అప్పగిస్తున్నారని ఆమె మండిపడ్డారు.శ్రీ ఆదిత్య కంపెనీ ప్రాజెక్టు విషయాన్ని ప్రస్తావిస్తూ, రివర్ బెడ్‌పై నిర్మాణాలు జరుగుతున్నాయని, ఆ కంపెనీ వెనుక ఓ ఎంపీ ఉన్నారని ఆరోపించారు. అయితే ఆ కంపెనీకి అనుమతులు గత BRS ప్రభుత్వ హయాంలోనే ఇచ్చారని కూడా ఆమె వ్యాఖ్యానించారు. "దాన్ని ముట్టుకునే దమ్ము ప్రభుత్వానికి ఉందా?" అని ప్రశ్నించారు.రాష్ట్రంలో నీటి వనరుల నిర్వహణపై కూడా ఆమె విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నీటి వ్యవహారాలపై అవగాహన లేదని వ్యాఖ్యానించారు. మహారాష్ట్ర సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వకపోతే ఏపీ సీఎం ఇవ్వరా? అని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ సీఎంతో చర్చించి 200 టీఎంసీల నీళ్లు తీసుకువచ్చిన తర్వాతే బనకచర్ల అంశంపై మాట్లాడాలని సూచించారు.

పాలన వ్యవస్థపై వ్యాఖ్యలు చేస్తూ, "అప్పుడు కేటీఆర్ పాలన నడిచింది, ఇప్పుడు కూడా కేటీఆర్ పాలనే నడుస్తోంది" అని అన్నారు. కేటీఆర్ అనే పేరుకు గతంలోనూ, ప్రస్తుతం కూడా విభిన్న అర్థాలు ఉన్నాయని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై కూడా ఆమె తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఎవరి జాగీర్ కాదని, పవన్ కల్యాణ్ రాజకీయ జోక్యం అంగీకరించబోమని హెచ్చరించారు. ఆయనకు మద్దతు ఇస్తే బీజేపీకి నాలుగు ఓట్లు వస్తాయని భావిస్తోందని, కానీ వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి ఉన్న సీట్లు కూడా తగ్గుతాయని అన్నారు.అలాగే పవన్ కల్యాణ్ 10 ఎకరాల శిఖం భూమి కొనుగోలు చేశారని, కోడికుంట సర్వే నంబర్ 706లో ఆ భూమి ఉందని ఆమె ఆరోపించారు. రిజిస్ట్రేషన్ సమయంలో తప్పులు జరిగాయని, ఆ భూమిని తిరిగి ప్రభుత్వానికి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఆ భూమిలో వేసిన కంచెను కూడా తొలగించాలని కవిత కోరారు.

ఈ వ్యాఖ్యలతో రాష్ట్ర రాజకీయాల్లో భూవివాదాలు, నీటి అంశాలు, మరియు అంతరాష్ట్ర రాజకీయాలపై మరోసారి తీవ్ర చర్చ మొదలైంది.

# జంతర్‌మంతర్ వద్ద కాక్రోచ్...

(మొదటి పేజీ తరువాయి)

**ఢిల్లీ వెలుతురు జూన్ 06:**

దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్, ఢిల్లీ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (Cockroach Janta Party) చేపట్టిన నిరసనలు తీవ్ర దృష్టిని ఆకర్షిస్తున్నాయి. నీట్ పేపర్ లీక్, CBSE ఓఎస్ఎం వ్యవస్థలో అవకతవకలు జరిగాయనే ఆరోపణల నేపథ్యంలో ఈ ఆందోళనలను ప్రారంభించారు.

సీఎజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే పిలుపుమేరకు వేలాది మంది యువత జంతర్‌మంతర్ వద్దకు చేరుకుని ప్రభుత్వ విధానాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. "ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి", "మేము మేక్ ఇన్ ఇండియా అడిగితే మీరు లీక్ ఇన్ ఇండియా ఇచ్చారు" అంటూ నినాదాలు హోరెత్తించారు.

ఈ నిరసన కార్యక్రమానికి కొన్ని రోజుల క్రితమే అభిజీత్ దీప్కే పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఆయన అమెరికాలోని బోస్టన్ నుంచి నేరుగా ఢిల్లీకి చేరుకుని ఈ ఆందోళనలో పాల్గొన్నారు. కార్యక్రమ సమయంలో ఆయన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జీవిత చరిత్రను చేతిలో పట్టుకొని కనిపించడం చర్చనీయాంశమైంది.

ఢిల్లీ పోలీసులు ఈ నిరసనలకు ముందస్తు అనుమతి ఇచ్చినప్పటికీ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. జంతర్‌మంతర్ పరిసర ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించారు.

అలాగే, మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో అభిజీత్ దీప్కే నివాసం వద్ద కూడా భద్రతను ఏర్పాటు చేశారు. నిరసనల నేపథ్యంలో అక్కడ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

ఈ ఆందోళనలపై సామాజిక ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ కూడా స్పందించారు. అభిజీత్ దీప్కే లేదా సీఎజేపీ సభ్యులను అరెస్టు చేస్తే 42 రోజుల పాటు నిరాహార దీక్ష చేపడతానని ఆయన హెచ్చరించారు.

ఈ నిరసన కార్యక్రమంలో తాను కూడా భాగస్వామిగా ఉంటానని సోనమ్ వాంగ్‌చుక్ ఇప్పటికే ప్రకటించడం ఉద్యమానికి మరింత బలం చేకూర్చినట్లైంది. దీంతో జంతర్‌మంతర్ ఆందోళనలు జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారాయి.

# మహిళా భవనాల నిర్మాణ పనుల...

(మొదటి పేజీ తరువాయి)

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, సెర్ప్ శాఖ అధికారులతో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ములుగు జిల్లా పర్యటనలో ఉన్న మంత్రి సీతక్క అక్కడి నుంచే శనివారం శాఖ ఉన్నతాధికారులు, జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిశోర్, కమిషనర్ దివ్యా దేవరాజన్, వివిధ జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గ్రామ మహిళా సమాఖ్య భవనాల నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా 8 వేల గ్రామ మహిళా సమాఖ్య భవనాలకు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు.ఈ భవనాలు కేవలం నిర్మాణాలు కాదని, మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకలుగా నిలిచే "ఆత్మగౌరవ భవనాలు" అని మంత్రి పేర్కొన్నారు. వాటి నిర్మాణ పనుల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు.భవనాల నిర్మాణ పురోగతిపై నిరంతరం సమీక్ష నిర్వహించేందుకు రెగ్యులర్‌గా వీడియో కాన్ఫరెన్స్‌లు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ప్రతి రోజు పనుల పురోగతిని తాను స్వయంగా పర్యవేక్షిస్తానని, అవసరమైతే రోజువారీ వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు.ప్రభుత్వ కార్యక్రమాలతో బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ మహిళా సమాఖ్య భవనాల నిర్మాణం ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యత అంశమని మంత్రి స్పష్టం చేశారు. అందుకే తానే స్వయంగా సమీక్షలు నిర్వహిస్తూ పనులను వేగవంతం చేస్తానన్నారు.ప్రతి ఎంపీడీవో తమ మండలంలో ప్రోగ్రాం ఆఫీసర్‌గా వ్యవహరిస్తూ గ్రామాల్లో భవనాల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు పనుల నాణ్యత, పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. అదేవిధంగా ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న పనులపై కూడా ప్రత్యేక దృష్టి సారించి, లక్ష్యాలను సాధించేలా క్షేత్రస్థాయిలో సమర్థవంతమైన అమలు జరగాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు.

# చేప ప్రసాదం పంపిణీ...

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో చేప ప్రసాదం పంపిణీ కి సంబంధించిన కౌంటర్లు, భారీకేడ్ లను పరిశీలించి క్యూలైన్లో వచ్చే భక్తులకు వేసవి దృష్ట్యా ఫ్యాన్లు కూలర్లు ఏర్పాటు చేయాలని ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు.చేప ప్రసాదం పంపిణీ ఈసారి 8 వ తేదీ రాత్రి 9 గంటలకు ప్రారంభం అవుతుండడంతో కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం నిఘా ఉంచాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.అలాగే క్యూలైన్ లలో తొక్కిసలాట జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని అలాగే ట్రాఫిక్ నియంత్రణ అమలులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. క్యూలైన్లో ఫ్యాన్లు కూలర్లు నిరంతరం వినియోగంలో ఉండాలని సూచించారు. అలాగే తాగునీరుతో పాటు నిరంతర విద్యుత్ సరఫరా లో ఆటంకం లేకుండా ఉండాలని అలాగే వాటర్ ప్రూఫ్ జనరేటర్లు కూడా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. చేప ప్రసాదం పంపిణీ పూర్తయ్యే వరకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అలాగే వాట్సప్ గ్రూప్ ద్వారా పర్యవేక్షణ చేయాలని ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో కంట్రోల్ రూమ్ ద్వారా మానిటరింగ్ చేయాలని ఆదేశించారు.ముఖ్యంగా నాంపల్లి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సూచించారు.అంబులెన్స్ లు ఏర్పాటు చేయడంతో పాటు మెడికల్ క్యాంపులు అవసరమైన మందులు సిద్ధం చేసుకోవాలని సూచించారు. క్యూలైన్ మధ్యలో సిపిఆర్ బృందాలు నిరంతరం పర్యవేక్షణ చేయాలని వైద్యాధికాలను ఆదేశించారు. ఇలాంటి ఇబ్బందుల, అసౌకర్యం ఉన్న ఎడల వెంటనే కంట్రోల్ రూమ్ కి సమాచారం అందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. వేసవి దృశ్య అన్ని ప్రాంతాల్లో ఎలక్ట్రిక్ వైరింగ్ నిరంతరం పర్యవేక్షించాలని అలాగే ఫైర్ ఇంజన్ వాహనాలు అందుబాటులో ఉంచాలని సూచించారు.షి టీమ్స్ ఏర్పాటు చేయాలని పిక్ పాకెట్ జరగకుండా అప్రమత్తంగా ఉండేలా అనౌన్స్ చేస్తూ వచ్చే ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.పోలీస్ యంత్రాంగం సీసీ కెమరా ల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. తాగునీరు లో ఇబ్బందులు రావద్దని వచ్చిన భక్తులకు ప్రతి సంవత్సరం మాదిరి స్వచ్ఛంద సంస్థలు ఉదయం అల్పాహారం అలాగే ఆహారాన్ని అందించనున్నారని వచ్చే ప్రజలు తప్పక స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు. అందించాలని తెలిపారు.హైదరాబాద్ మహానగరంలో చేపట్టి చేప ప్రసాదాన్ని కుల మతాలకు రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి ప్రసాదాన్ని స్వీకరించాలని ఆరోగ్య తెలంగాణ మన ముందున్న లక్ష్యమని మంత్రి ఈ సందర్భంగా అన్నారు.ఈసారి 8 వ తేదీ రాత్రి 9 గంటలకు చేప ప్రసాద కార్యక్రమం ప్రారంభమవుతుందని మంత్రి తెలిపారు.మృగశిర రాత్రి వస్తున్నందున తీసుకోవాల్సిన చర్యల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.అలాగే 9 వ తేదీ నిరంతరంగా రాత్రి వరకు చేప ప్రసాదం పంపిణీ చేయడం జరుగుతుందని చివరి వ్యక్తి వరకు ప్రసాదం అందించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని మంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

ప్రజలు నమ్మకం విశ్వాసంతో అధిక సంఖ్యలో పాల్గొంటున్నందున ఏర్పాట్లు కూడా ప్రభుత్వం ఆ దిశగా చేపట్టిందని అలాగే అన్ని స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములై ఇతర రాష్ట్రాల నుండి వస్తున్న వారికి ఇబ్బందులు కలగకుండా వారికి వసతి సౌకర్యం ,ఆహారం తదితర ఏర్పాట్లు చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు.ఏర్పాట్ల విషయంలో విధుల విషయంలో ఎవరు ఆలస్వతంగా ఉండవద్దని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

నాణ్యమైన కొర్రమీనుచేప పిల్లలు లక్షా నలుభై వేలు వరకు మత్స్య శాఖ ఆధ్వర్యంలో అందుబాటులో ఉంచడం జరిగిందని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు.

శాంతి భద్రతలు నిర్వహణ ముఖ్యమని అలాగే నిరంతరం పోలీస్ అధికారులు నిఘా ఉంచాలని సూచించారు.

తదుపరి మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ మృగశిర కార్తి వాతావరణ మార్పులు తీసుకొస్తుందని, వేడి నుండి చల్లబడే కార్తి గా మృగశిర పిలుస్తారని అన్నారు. నమ్మకం, విశ్వాసంతో

176 సంవత్సరాలుగా చేప ప్రసాదం పంపిణీ బత్తిన సోదరులు ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రజలకు ప్రసాదం అందజేస్తున్నారని అన్నారు. అన్ని విభాగాలతో ఇప్పటికీ ఇంచార్జి మంత్రి గారు పలు దఫాలు సమీక్షా సమావేశం నిర్వహించారని అన్నారు.

లక్షా 40 వేల చేప పిల్లలు మా డిపార్ట్మెంట్ నుండి ఏర్పాటు చేశామని తెలిపారు.

ఈ కార్యక్రమాన్ని పూర్తిగా బత్తిన కుటుంబం అనవాయితీ నిర్వహిస్తున్నారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కోసం అన్ని విభాగాలు సమన్వయం తో కలిసి పని చేస్తున్నాయని అన్నారు.

# కోహెడ అంతర్జాతీయ సమీకృత...

(మొదటి పేజీ తరువాయి)




అంతర్జాతీయ విమానాశ్రయం తర్వాత కోహెడ ఫ్రూట్ మార్కెట్ రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో పండ్లు, కూరగాయల ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందని, కందుకూరు ప్రాంతంలో ఉత్పత్తి అయ్యే టమోటా ఆధారంగా సాస్ తయారీ పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. రైతులకు మార్కెటింగ్, నిల్వ, ప్రాసెసింగ్ సదుపాయాలు కల్పించడం ద్వారా వ్యవసాయాన్ని లాభదాయకంగా మారుస్తామని తెలిపారు.

ఫ్రూట్ మార్కెట్ నిర్మాణ పనులు వేగంగా పూర్తయ్యేలా అవసరమైన నిధులను గ్రీన్ ఛానల్ ద్వారా విడుదల చేస్తామని, ఈ ఏడాది డిసెంబర్ నాటికి మార్కెట్ కార్యకలాపాలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రెండు సంవత్సరాల్లో ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు.రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేపడుతున్నామని, ప్రపంచ ప్రసిద్ధి చెందిన సంస్థలను అక్కడకు ఆకర్షించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. అలాగే రీజనల్ రింగ్ రోడ్, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, వరంగల్ మరియు ఆదిలాబాద్ విమానాశ్రయాల అభివృద్ధి వంటి కీలక ప్రాజెక్టులను ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందన్నారు.ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అవుటర్ రింగ్ రోడ్ పరిధిలోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా విభజించి సమీకృత ఆధునిక కార్యాలయ సముదాయాల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం రిజిస్ట్రేషన్ల ద్వారా రాష్ట్రానికి భారీ ఆదాయం వస్తోందని, ఆ ఆదాయానికి అనుగుణంగా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు.వ్యవసాయ రంగానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, వరి పంటకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ధాన్యం ఉత్పత్తి నమోదైందని చెప్పారు.సంక్షేమ కార్యక్రమాల అమలులో భాగంగా రాష్ట్రంలో 15 లక్షల కొత్త రేషన్ కార్డులు జారీ చేశామని, 3.28 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, రైతులకు రూ.20 వేల కోట్ల రుణమాఫీ, మహిళలకు వడ్డీ రాయితీతో బ్యాంకు లింకేజ్ రుణాలు, మహిళల ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.



రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా కొనసాగిస్తున్నామని, తెలంగాణను దేశంలో ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి అన్నారు.

# రాజేష్ ఎక్స్‌పోర్ట్స్ కుంభకోణం మరియు నరేంద్ర మోదీ

హైదరాబాద్ వెలుతురు జూన్ 06:

మరో కుంభకోణ ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజేష్ మెహతాతో మోదీ గారి పాత సంబంధాలు మరోసారి చర్చకు వస్తున్నాయి.

- ₹15 లక్షల కోట్లకు పైగా స్కామ్ చేసి లక్షలాది మంది చిన్న పెట్టుబడిదారులను నష్టపరిచిన రాజేష్ మెహతాకు మోదీ గారితో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, వారిద్దరి పాత ఫోటోలు కూడా చాలానే ఉన్నాయని చెబుతున్నారు.
- రాజేష్ ఎక్స్‌పోర్ట్స్ అనే భారతీయ ఆభరణాల సంస్థ FY21 నుండి FY25 వరకు ఐదేళ్ల కాలంలో ₹15.15 లక్షల కోట్ల ఫేక్ రెవెన్యూ (నకిలీ ఆదాయం) చూపిందని ఆరోపణలు ఉన్నాయి. సూటిగా చెప్పాలంటే, కంపెనీ చూపించిన ఆదాయంలో 99% వరకు కల్పితమని అంటున్నారు.
- ముఖ్యంగా తన స్విస్ అనుబంధ సంస్థ Val-cambi SA ద్వారా భారీ ఆదాయాన్ని చూపించిన ప్పటికీ, అందుకు సంబంధించిన ఇన్‌వాయిస్‌లు, కస్టమర్ వివరాలు, నిల్వలు (ఇన్వెంటరీ), కొనుగోలు-అమ్మకాల ధృవీకరణలు లేవని పేర్కొంటున్నారు.
- ప్రమోటర్లకు సంబంధించిన సంస్థలకు అవసరమైన అనుమతులు లేదా పూర్తి వివరాలు వెల్లడిం చకుండా భారీ స్థాయిలో నిధులు మళ్లించబడినట్లు ఆరోపణలు ఉన్నాయి.
- 2026 జూన్ 3న Securities and Exchange Board of India (SEBI) తన 109 పేజీల ఉత్తర్వులో కంపెనీ యజమాని, చైర్మన్ రాజేష్ మెహతాతో పాటు కంపెనీపై కూడా భారతీయ మూలధన మార్కెట్లలో ట్రేడింగ్ నిషేధం విధించింది.
- కంపెనీ షేరు ధర 80% వరకు కుప్పకూలడంతో




ఒక్కరోజులోనే షేర్ హోల్డర్లకు ₹12,726 కోట్ల సంపద నష్టం వాటిల్లిందని చెబుతున్నారు. ఎప్పటిలాగే ఈ భారీ కుంభకోణాల భారాన్ని చిన్న పెట్టుబడిదారులే మోసారని విమర్శలు వస్తున్నాయి.

- లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ అఫ్ ఇండియా (LIC) ఈ కంపెనీలో ₹2,000 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టగా, షేరు పతనం వల్ల సుమారు ₹1,600 కోట్ల నష్టం చవిచూసిందని పేర్కొంటున్నారు. ఇది సాధారణ భారతీయుల సొమ్మేనని విమర్శకులు అంటున్నారు.
- ఈ కుంభకోణం ఐదేళ్ల పాటు మోదీ ప్రభుత్వానికి తెలిసీ తెలియనట్టుగా సాగిందని, అదే సమయంలో ప్రధాని రాజేష్ మెహతాతో ఫోటోలు దిగుతూ కని పించారని ఆరోపిస్తున్నారు.

ఈ వ్యవహారం భారతదేశంలో క్రోనీ క్యాపిటలిజం, ప్రయోజనాల సంఘర్షణ (Conflict of Interest), అలాగే మోదీ ప్రభుత్వం మరియు ప్రధానమంత్రిపై వస్తున్న అవినీతి ఆరోపణలకు ఉదాహరణగా నిలుస్తోందని విమర్శకులు పేర్కొంటున్నారు.

కోట్లాది రూపాయల ప్రజల డబ్బును మోసం చేసిన అనేక మంది పెద్ద మోసగాళ్లు నరేంద్ర మోదీ హయాంలో విదేశాలకు పారిపోయారని, గత 12 ఏళ్లలో వారిలో ఒక్కరినైనా పూర్తిగా భారతదేశానికి తీసుకురా వడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శలు ఉన్నాయి.

రాజేష్ మెహతాతో ఫోటోలు దిగడాన్ని మించి, ఈ కుంభకోణంలో నష్టపోయిన లక్షలాది చిన్న పెట్టుబడిదారుల సొమ్మును రక్షించడానికి లేదా తిరిగి పొందడానికి ప్రధాని ఏ చర్యలు తీసుకున్నారనే ప్రశ్నలు లేవ నెత్తబడుతున్నాయి.

"నా తినను, తిననివ్వను" అనే వారి నినాదం మరోసారి ప్రశ్నార్థకంగా మారిందని విమర్శకులు అంటున్నారు.

₹15 లక్షల కోట్లలో ఉన్న సున్నాలను లెక్కపెట్టడానికే వేళ్లు అలసి పోతాయి!

కానీ మోదీ గారి పాలనలో అన్ని వైపులా కుంభకోణాలు పెరిగిపోతు న్నాయని, దాదాపు ప్రతి పెద్ద కుంభకోణంతోనూ అధికార వర్గాలకు ఏదో ఒక సంబంధం బయటపడుతోందని విమర్శకులు ఆరోపి స్తున్నారు. కొంతమంది రాజకీయ బ్రోకర్లు భారతీయ జనతా పార్టీ ముసుగులో దేశ అభివృద్ధిలో భాగస్వాములమని చెప్పుకుంటూ, తమ వ్యాపార ప్రయోజనాలను ప్రజలపై రుద్దుతూ వారిని మోసగించే ప్రయత్నాలు చేస్తున్నారని, అలాంటి వ్యక్తులను కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం కాపాడేందుకు ప్రయత్నిస్తోందనే అభిప్రాయం దేశంలోని అనేక ప్రాంతాల్లో ప్రజల్లో వ్యక్తమవుతోందని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పీ. ప్రసన్న కుమార్ శర్మ పేర్కొన్నారు.

దేశవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న అనేక ఆర్థిక అవకతవకలు, కుంభ కోణాలపై దృష్టి సారించాల్సిన ఈడీ, సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలు కేవలం రాజకీయ ప్రత్యర్థులపైనే దృష్టి కేంద్రీకరించి, వారిని ఇబ్బందులకు గురిచేస్తూ భారతీయ జనతా పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నాయనే అనుమానం ప్రజల్లో బలంగా ఉందన్నారు. ఈ అంశాలపై ప్రజలు భవిష్యత్తులో ప్రధాని నరేంద్ర మోదీని ప్రశ్నించడమే కాకుండా, రాబోయే ఎన్నికల్లో తమ ఓటు ద్వారా తగిన సమాధానం ఇస్తారనే చర్చలు వివిధ వర్గాల్లో జరుగుతున్నాయని తెలిపారు.

కొంతమంది వ్యాపారవేత్తలను కాపాడేందుకు, అలాగే కాంగ్రెస్ పార్టీ ఏ రాష్ట్రంలోనూ అధికారంలోకి రాకుండా చేయాలనే రాజకీయ ఉద్దేశంతో దేశ ప్రకృతి సంపదను, ప్రభుత్వ రంగ సంస్థలను కొద్దిమంది కార్పొరేట్ వర్గాలకు అప్పగించే విధంగా కొన్ని నిర్ణయాలు తీసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు.

అలాంటి అంశాలపై సమగ్ర, నిష్పాక్షిక దర్యాప్తు నిర్వహించే ధైర్యం కేంద్ర ప్రభుత్వానికి లేదని, దీనిని దేశ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేస్తూ, "భారతదేశం వెలిగిపో తోందని మీరు చెబుతున్నారు. కానీ మీ పాలనపై దేశ ప్రజల్లో తీవ్ర అసంతృప్తి పెరుగుతోందనే విషయాన్ని కూడా ఒకసారి గుర్తించాలి. కనీసం నెలకు ఒకసారైనా భారత మీడియా సంస్థలను ఎదుర్కొని వారి ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వండి. అప్పుడు మాత్రమే ప్రజలు మిమ్మల్ని ఎంతవరకు విశ్వసిస్తున్నారో తెలుస్తుంది" అని వ్యాఖ్యానించారు.

దేశ ప్రజల సమస్యలను పక్కనపెట్టి విదేశీ పర్యటనలకు ప్రాధాన్యత ఇస్తున్నారని, మరోవైపు ప్రజలకు ఖర్చులు తగ్గించుకోవాలని, బంగారం కొనవద్దని సూచనలు చేస్తున్నారని విమర్శించారు. కొందరు ప్రముఖ వ్యాపార సంస్థల్లో పెట్టుబడులు పెట్టి నష్టపోయిన ప్రజల పట్ల కనీస సానుభూతి కూడా చూపకుండా వ్యవహరించడం ఎంతవరకు సమంజ సమని ప్రశ్నించారు.

దేశంలో వరుసగా ఆర్థిక కుంభకోణాలు, పెట్టుబడిదారులను ప్రభావితం చేసే ఘటనలు జరుగుతున్నప్పటికీ ప్రధానమంత్రి మౌనం పాటించడం ఒక దేశ పౌరునిగా తనను తీవ్రంగా కలచివేస్తోందని పేర్కొన్నారు. ఈ వ్యవహారాలన్నింటిపైనా సమగ్ర, పారదర్శక విచారణ జరగాలని దేశ ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు.

ఈ వ్యాఖ్యలకు సంబంధించిన సందర్భంలో, ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి ఉన్న సంబంధిత వ్యక్తి ఫోటోను కూడా ఆయన షేర్ చేసినట్లు వెల్లడించారు.ఈ కంపెనీ లో LIC సంస్థ కూడా దాదాపు 15 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టినట్లు సమాచారం ఉంది అని



పి. ప్రసన్నకుమార్ శర్మ, ప్రధాన కార్యదర్శి
తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ

# పెదపెంకి గ్రామ అభివృద్ధిపై పవన్ కల్యాణ్ సమీక్ష

- ఫైలేరియా కేసులపై ప్రత్యేక దృష్టి సారించిన డిప్యూటీ సీఎం
- పారిశుద్ధ్య లోపమే ఆరోగ్య సమస్యలకు కారణమని అధికారుల నివేదిక
- మురుగునీటి కాలువల ఆక్రమణలపై చర్యలు ప్రారంభం
- గ్రామంలో మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణానికి రూపకల్పన
- ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్న అధికారులు
- ప్రతిఘటనల మధ్య కొనసాగిన అభివృద్ధి పనులు
- అధికారుల కృషిని అభినందించిన పవన్ కల్యాణ్
- ఈ నెల 24న అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం
- పార్వతీపురం మన్యంలో అభివృద్ధి దిశగా కీలక అడుగు



అమరావతి వెలుతురు జూన్ 06:

పార్వతీపురం మన్యం జిల్లాలోని పెదపెంకి గ్రామం అభివృద్ధి పనులపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమీక్ష నిర్వహించారు. గ్రామంలో నెలకొన్న ఆరోగ్య సమస్యలు, మౌలిక వసతుల లోపాలు, పారిశుద్ధ్య పరిస్థితులను అధికారులు ఆయనకు వివరించారు.

గ్రామంలో వందకు పైగా ఫైలేరియా కేసులు నమోదవటం, తరచుగా జ్వరాల వ్యాప్తి జరుగుతుండటంతో ఈ ప్రాంతంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

ప్రజల ఆరోగ్య పరిస్థితులు ఆందోళనకరంగా మారడంతో సమస్యల మూలాలను గుర్తించి శాశ్వత పరిష్కారాల దిశగా చర్యలు చేపట్టారు.

అధికారుల నివేదిక ప్రకారం, గ్రామంలో ప్రధాన సమస్య పారిశుద్ధ్య లోపమేనని తేలింది. మురుగునీటి ప్రవాహానికి సరైన మార్గాలు లేకపోవడం, డ్రెయినేజీ వ్యవస్థ పూర్తిగా సరిగా లేకపోవడం వల్ల వ్యాధులు వ్యాపిస్తున్నాయని గుర్తించారు. కొన్ని ప్రాంతాల్లో ఉన్న కాలువలు ఆక్రమణలకు గురవడం పరిస్థితిని మరింత తీవ్రతరం చేసినట్లు అధికారులు వివరించారు.

ఈ సమస్యల పరిష్కారానికి భాగంగా గ్రామంలో 'మ్యాజిక్ డ్రెయిన్లు' నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు అధికారులు డిప్యూటీ సీఎంకు తెలిపారు. ఆక్రమణలు తొలగించి, ఆధునిక డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయడం ద్వారా దీర్ఘకాలిక పరిష్కారం సాధించాలనే లక్ష్యంతో పనులు కొనసాగుతున్నాయి.

ప్రారంభ దశలో ఈ పనులకు గ్రామస్థుల నుంచి కొంత ప్రతిఘటన ఎదురైనప్పటికీ, అధికారులు వారిని ఒప్పించి అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లినట్లు వెల్లడించారు. ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి సమస్యలను వివరించి సహకారం పొందినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారుల కృషిని ప్రశంసించారు. జిల్లా పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు సామాజిక సవాళ్లను అధిగమించి పనులను ముందుకు తీసుకెళ్లిన విధానాన్ని ఆయన అభినందించారు.

అభివృద్ధి పనులు వేగంగా పూర్తిచేసి గ్రామ ప్రజలకు మెరుగైన జీవన పరిస్థితులు కల్పించాలని ఆయన సూచించారు. ఆరోగ్య సమస్యలకు మూలకారణాలను పూర్తిగా తొలగించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

ఈ నెల 24వ తేదీన తాను స్వయంగా పెదపెంకి గ్రామంకు వచ్చి మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణంతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తానని పవన్ కల్యాణ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పెదపెంకి గ్రామంలో చేపడుతున్న ఈ అభివృద్ధి కార్యక్రమాలు, ముఖ్యంగా పారిశుద్ధ్య వ్యవస్థను మెరుగుపరచే ప్రయత్నాలు, గ్రామ ఆరోగ్య పరిస్థితుల్లో గణనీయమైన మార్పు తీసుకువస్తాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఐరాస వేదికపై భారత్-పాక్ మధ్య...

(మొదటి పేజీ తరువాయి)

- ఐరాస వేదికను దుర్వినియోగం చేస్తున్న పాక్‌పై తీవ్ర విమర్శలు
- భద్రతా మండలి సంస్కరణలపై భారత్ కీలక వ్యాఖ్యలు
- దౌత్య వేదికపై మరోసారి భారత్—పాక్ మాటల యుద్ధం
- జమ్మూకశ్మీర్ అంశంపై పాక్ పునరావృత ఆరోపణలు
- వాస్తవాలను మార్చలేవని భారత్ స్పష్టీకరణ
- అంతర్జాతీయ సమాజంలో చర్చనీయాంశంగా మారిన ఘర్షణ

ఐక్యరాజ్యసమితి వెలుతురు జూన్ 06:

ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశ వేదిక మరోసారి భారత్, పాకిస్థాన్ మధ్య దౌత్యపరమైన వాగ్వాదానికి కేంద్రంగా మారింది. భద్రతా మండలి వార్షిక నివేదికపై జరిగిన సాధారణ చర్చలో పాకిస్థాన్ ప్రతినిధి అసిమ్ ఇఫ్తిఖార్ అహ్మద్ జమ్మూకశ్మీర్ అంశాన్ని ప్రస్తావించడంతో పరిస్థితి ఉద్రిక్తతకు దారితీసింది.

ఈ వ్యాఖ్యలపై ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ తీవ్రంగా స్పందించారు. పాకిస్థాన్ తరచుగా అంతర్జాతీయ వేదికలను తమ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తూ భారత్‌పై నిరాధార ఆరోపణలు చేస్తోందని ఆయన మండిపడ్డారు. ఐరాస వంటి ప్రతిష్టాత్మక వేదికలను దుర్వినియోగం చేయడం పాకిస్థాన్‌కు అలవాటుగా మారిందని ఆయన వ్యాఖ్యానించారు.

పాక్ వ్యాఖ్యలపై భారత్ ఘాటు స్పందన

భారత ప్రతినిధి తన ప్రసంగంలో స్పష్టంగా పేర్కొంటూ, భారతదేశ అంతర్గత వ్యవహారాలపై పాకిస్థాన్ జోక్యం అంగీకారయోగ్యం కాదని తెలిపారు. జమ్మూకశ్మీర్ భారత్‌లో అంతర్భాగమని ఆయన పునరుద్ఘా టించారు. ఈ విషయంలో అంతర్జాతీయ వేదికపై ఎలాంటి తప్పుడు వ్యాఖ్యలు చేసినా అవి వాస్తవాలను మార్చలేవని ఆయన స్పష్టం చేశారు.

పాకిస్థాన్ తరచూ జమ్మూకశ్మీర్ అంశాన్ని ప్రస్తావించడం ద్వారా అంతర్జాతీయ సమాజాన్ని తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తోందని ఆయన ఆరోపించారు. ఇది సమస్య పరిష్కారానికి దోహదం చేయదని, కేవలం రాజకీయ ప్రదర్శన మాత్రమేనని ఆయన వ్యాఖ్యానించారు.

ఐరాస వేదికను దుర్వినియోగం చేస్తున్న పాక్

భారత ప్రతినిధి ప్రసంగంలో పాకిస్థాన్ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. విభజన రాజకీయ ప్రయోజనాల కోసం ఐక్యరాజ్యసమితి వేదికను ఉపయోగించడం ఒక దేశానికి తగదని ఆయన అన్నారు. ప్రపంచ శాంతి, భద్రతల కోసం ఏర్పడిన వేదికను వివాదాలు సృష్టించేందుకు ఉపయోగించడం బాధాకరమని పేర్కొన్నారు.

అంతర్జాతీయ సమాజం నిజాలను గమనిస్తోందని, పాకిస్థాన్ తరచుగా చేస్తున్న ఆరోపణలకు వాస్తవ ఆధారాలు లేవని ఆయన వ్యాఖ్యానించారు. బాధ్యతాయుతమైన దేశంగా వ్యవహరించాల్సిన అవసరం పాకిస్థాన్‌పై ఉందని ఆయన సూచించారు.

★జమ్మూకశ్మీర్‌పై భారత్ స్పష్టమైన స్థానం★

ఈ చర్చలో భారత ప్రతినిధి జమ్మూకశ్మీర్ అంశంపై భారత్ స్థానం మరోసారి స్పష్టంగా తెలిపారు. ఆ ప్రాంతం పూర్తిగా భారతదేశంలో అంతర్భాగమని, ఇది ఎటువంటి చర్చకు అవకాశం లేని అంశమని ఆయన అన్నారు. భారతదేశ సార్వభౌమత్వంపై ఎలాంటి వ్యాఖ్యలను కూడా అంగీకరించబోమని ఆయన హెచ్చరించారు.

అంతర్జాతీయ వేదికల్లో ఈ అంశాన్ని తిరిగి తిరిగి ప్రస్తావించడం పాకిస్థాన్ యొక్క రాజకీయ వ్యూహమని ఆయన విమర్శించారు. ఇది ప్రాంతీయ స్థిరత్వానికి సహాయపడదని, దౌత్య సంబంధాలను మరింత దెబ్బతీస్తుందని ఆయన పేర్కొన్నారు.

భద్రతా మండలి సంస్కరణలపై భారత్ అభిప్రాయం

ఈ సందర్భంగా భారత ప్రతినిధి ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సంస్కరణల అవసరాన్ని కూడా ప్రస్తావించారు. ప్రస్తుత ప్రపంచ పరిస్థితులు, భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను దృష్టిలో ఉంచుకుని భద్రతా మండలిలో మార్పులు అవసరమని ఆయన అభిప్రాయ పడ్డారు. ప్రపంచ దేశాల ప్రతినిధిత్వం మరింత సమర్థవంతంగా ఉండాలంటే భద్రతా మండలి నిర్మాణంలో సమగ్ర మార్పులు అవస రమని భారత్ దీర్ఘకాలంగా కోరుకుంటోందని ఆయన గుర్తుచేశారు.

## దౌత్య వేదికపై కొనసాగుతున్న భారత్—పాక్ ఉద్రిక్తత

ఈ ఘటనతో మరోసారి ఐక్యరాజ్యసమితి వేదికపై భారత్—పాక్ మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు బయటపడ్డాయి. గతంలోనూ అనేకసార్లు ఇరుదేశాల ప్రతినిధుల మధ్య ఇలాంటి మాటల యుద్ధాలు చోటుచేసుకున్నాయి.

అంతర్జాతీయ వేదికల్లో పాకిస్థాన్ తరచుగా జమ్మూకశ్మీర్ అంశాన్ని లేవనెత్తడం, భారత్ దాన్ని తీవ్రంగా ఖండించడం సాధారణంగా మారిపోయింది. ఈ తాజా ఘటన కూడా అదే ధోరణికి కొనసాగింపుగా కనిపిస్తోంది.

## అంతర్జాతీయ సమాజంలో చర్చ

ఈ వాగ్వాదం అంతర్జాతీయ దౌత్య వర్గాల్లో కూడా చర్చనీ యాంశంగా మారింది. ఐరాస వేదికపై ఇలాంటి ప్రత్యక్ష విమర్శలు రెండు దేశాల మధ్య ఉన్న దీర్ఘకాలిక రాజకీయ ఉద్రిక్తతలను మరోసారి వెలుగులోకి తెచ్చాయి. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఇలాంటి ఘర్షణలు పరిష్కారానికి దోహదం చేయకపోగా, దౌత్య సంబంధాలను మరింత సంక్లిష్టం చేస్తాయి.

# "బాహుబలి కాదు... బాబు హుకుం పాటించే కట్టప్ప!"

రాజకీయాల్లో జ్ఞాపకశక్తి తక్కువగా ఉంటుందని కొందరు భావిస్తారు. ప్రచారం, మీడియా హడావిడి, భారీ సభలు, భావోద్వేగ ప్రసంగాలతో ప్రజలు గతాన్ని మర్చిపోతారని అనుకుంటారు. కానీ తెలంగాణ సమాజాన్ని అలా అంచనా వేయడం రాజకీయ అవివేకం. ఎందుకంటే ఈ నేల చరిత్రను మోస్తుంది. ఈ నేల త్యాగాలను గుర్తుంచుకుంటుంది. ఈ నేల తనపై జరిగిన అన్యాయాలను మరిచిపోదు. అందుకే తెలంగాణ గురించి మాట్లాడే ప్రతి నాయకుడిని ఇక్కడి ప్రజలు ఒకే కొలమానంతో కొలుస్తారు. నువ్వు ఏమి మాట్లాడావు అనేది కాదు... తెలంగాణ కోసం ఏమి చేశావు అనేదే అసలు ప్రశ్న.

నేడు రాజకీయ వేదికలపై తెలంగాణ అమరవీరుల గురించి, తెలంగాణ ఆత్మగౌరవం గురించి, తెలంగాణ ప్రజల భావోద్వేగాల గురించి మాట్లాడుతున్న వారిని చూస్తుంటే తెలంగాణ సమాజంలో ఒక సహజమైన అనుమానం వ్యక్తమవుతోంది. ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి పడుతున్నప్పుడు కనిపించని వారు ఇప్పుడు ఎందుకు తెలంగాణపై ప్రేమ చూపిస్తున్నారు? రాష్ట్రం కోసం వేలాది మంది యువకులు ప్రాణత్యాగాలు చేసినప్పుడు వారి పక్కన నిలబడని వారు ఇప్పుడు తెలంగాణ గౌరవం గురించి మాట్లాడటానికి ఏ నైతిక హక్కుతో ముందుకు వస్తున్నారు? ఈ ప్రశ్నలు కేవలం రాజకీయ ప్రత్యర్థులవి కావు. ఇవి తెలంగాణ సమాజం అడుగుతున్న ప్రశ్నలు.

తెలంగాణ ఉద్యమం అనేది ఒక ఎన్నికల నినాదం కాదు. అది చరిత్రలో ఒక గొప్ప సామాజిక ఉద్యమం. 1969లో విద్యార్థుల రక్తంతో ప్రారంభమైన ఆ ఉద్యమం, దశాబ్దాల పోరాటం తర్వాత 2014లో రాష్ట్ర రూపంలో సాకారమైంది. ఆ ప్రయాణంలో వేలాది మంది యువకులు తమ భవిష్యత్తును త్యాగం చేశారు. అనేక కుటుంబాలు తమ పిల్లలను కోల్పోయాయి. వేలాది మంది ఉద్యమకారులు జైళ్లకు వెళ్లారు. ఎన్నో జీవితాలు చీకటిలో కలిసిపోయాయి. తెలంగాణ సాధన కోసం పోరాడిన వారు తమ వ్యక్తిగత జీవితాలను పణంగా పెట్టారు. అలాంటి చరిత్రను కేవలం రాజకీయ వేదికలపై ప్రసంగాల కోసం ఉపయోగించుకోవడం తెలంగాణ ప్రజలకు అసహనాన్ని కలిగిస్తుంది.

ఇక్కడే పవన్ కళ్యాణ్ రాజకీయ ప్రయాణం గురించి చర్చ మొదలవుతుంది. సినిమా హీరోగా ఆయనకు ఉన్న అభిమానాన్ని ఎవరూ ప్రశ్నించరు. తెలుగు సినీ పరిశ్రమలో ఆయనకు ప్రత్యేక స్థానం ఉందనేది వాస్తవం. లక్షలాది మంది యువత ఆయనను అభిమానిస్తారు. ఆయన సినిమాలు భారీ వసూళ్లు సాధించాయి. కానీ రాజకీయాల్లో అభిమానంతో పాటు విశ్వసనీయత కూడా అవసరం. తెరపై పోషించిన పాత్రలు ఓటు పెట్టించే కారణం కావు. ప్రజల జీవితాల్లో నిలిచిన పాత్రలే రాజకీయ భవిష్యత్తును నిర్ణయిస్తాయి.

తెలంగాణ ఉద్యమం సమయంలో పవన్ కళ్యాణ్ ఎక్కడ నిలబడ్డారు? ఉద్యమకారుల పక్షాన నిలిచారా? అమరుల కుటుంబాలకు అండగా నిలిచారా? తెలంగాణ విద్యార్థుల ఆవేదనను దేశానికి వినిపించారా? ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు కనిపించవు. కానీ నేడు తెలంగాణ గురించి మాట్లాడే హక్కును మాత్రం ఆయన వినియోగిస్తున్నారు. అదే తెలంగాణ ప్రజల్లో సందేహాలను పెంచుతోంది.

మరోవైపు రాజకీయ పరిణామాలను గమనిస్తే పవన్ కళ్యాణ్ స్వతంత్ర రాజకీయ నాయకుడిగా కంటే, మరొకరి రాజకీయ వ్యూహంలో భాగస్వామిగా కనిపిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అందుకే "బాబు డైరెక్షన్‌లో కట్టప్పగా మారిన పవన్ కళ్యాణ్" అనే వ్యాఖ్య రాజకీయ చర్చల్లో చోటు చేసుకుంటోంది. కట్టప్ప తనకు నచ్చినా నచ్చకపోయినా ఆజ్ఞను పాటించాల్సిన పాత్ర. అదే విధంగా ఒక నాయకుడు తన స్వంత రాజకీయ ఆలోచనల కంటే మరొకరి రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరిస్తున్నాడనే భావన ప్రజల్లో ఏర్పడితే అతని నాయకత్వంపై ప్రశ్నలు రావడం సహజం.

తెలంగాణ సమాజం ఎప్పుడూ స్వాభిమానాన్ని అత్యంత విలువైన అంశంగా భావించింది. ఈ ప్రాంత ప్రజలు కేవలం అభివృద్ధి కోసం మాత్రమే ఉద్యమించలేదు. గౌరవం కోసం కూడా ఉద్యమించారు. తమ భాషను, తమ యాసను, తమ సంస్కృతిని, తమ చరిత్రను అవమానించిన వ్యవస్థలకు వ్యతిరేకంగా పోరాడారు. అలాంటి సమాజం ముందు నిలబడి తెలంగాణ గురించి మాట్లాడాలంటే ముందుగా ఆ చరిత్రకు నమస్కరించాలి. ఆ త్యాగాలను గౌరవించాలి. ఆ ఉద్యమ స్ఫూర్తిని అర్థం చేసుకోవాలి.

కృష్ణా, గోదావరి జలాల విషయంలో తెలంగాణకు జరిగిన అన్యాయం గురించి దశాబ్దాలుగా చర్చ జరుగుతోంది. మహబూబ్‌నగర్ వంటి ప్రాంతాలు కరువుతో అల్లాడిన పరిస్థితులను తెలంగాణ ప్రజలు ఇప్పటికీ మర్చిపోలేదు. ఉమ్మడి రాష్ట్రంలో నీటి పంపిణీ, నిధుల కేటాయింపు, ఉద్యోగాల విషయంలో జరిగిన వివక్ష ఉద్యమానికి ప్రధాన కారణాల్లో ఒకటి. రాష్ట్ర విభజన తర్వాత కూడా ఈ అంశాలు పూర్తిగా పరిష్కారం కాలేదు. అలాంటి కీలక అంశాలపై పవన్ కళ్యాణ్ వంటి నాయకులు స్పష్టమైన వైఖరి ప్రకటించారా? తెలంగాణ హక్కుల కోసం పోరాడారా? అనే ప్రశ్నలకు సమాధానాలు ప్రజలకు కనిపించడం లేదు.

రాజకీయ నాయకుడి అసలు పరీక్ష ఎన్నికల సమయంలో కాదు. ప్రజల సమస్యల సమయంలో. రైతు ఆత్మహత్య చేసుకున్నప్పుడు. నిరుద్యోగ యువకుడు నిరాశలో ఉన్నప్పుడు. విద్యార్థి తన భవిష్యత్తు గురించి ఆందోళన చెందుతున్నప్పుడు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలు న్యాయం కోరుతున్నప్పుడు. నాయకుడు ఎక్కడ నిలబడతాడో అదే అతని నిజమైన రాజకీయ స్వరూపాన్ని నిర్ణయిస్తుంది. తెలంగాణ ప్రజలు ఇదే ప్రమాణంతో నాయకులను అంచనా వేస్తారు.

ఈ నేలపై పోరాటం చేసిన మహనీయులను తెలంగాణ ఎప్పటికీ మరిచిపోదు. కొండా లక్ష్మణ్ బాపూజీ, ప్రొఫెసర్ జయశంకర్, కొమరం భీం, చాకలి ఐలమ్మ, గద్దర్, కేశవరావు జాదవ్, విద్యాసాగర్ రావు, గూడ అంజన్న వంటి మహనీయులు పదవుల కోసం కాకుండా తెలంగాణ కోసం జీవించారు. వారు రాజకీయ లాభనష్టాలను లెక్కించలేదు. ప్రజల హక్కుల కోసం నిలబడ్డారు. అందుకే వారి పేర్లు చరిత్రలో నిలిచిపోయాయి. అదే సమయంలో ఉద్యమాలకు దూరంగా ఉండి, తర్వాత రాజకీయ అవకాశాల కోసం తెలంగాణ పేరు ఉపయోగించుకున్న వారిని ప్రజలు గుర్తించక పోవడం కూడా ఈ చరిత్రలో భాగమే.

తెలంగాణ సమాజం మరో గొప్ప లక్షణం ఏమిటంటే వ్యక్తి పూజకు లోబడకపోవడం. ఈ నేల నిజాం పాలనను ఎదిరించింది. సామంతవాదాన్ని ఎదిరించింది. ప్రాంతీయ వివక్షను ఎదిరించింది. అధికార అహంకారాన్ని ఎదిరించింది. అలాంటి సమాజం ఒక సినిమా హీరో ముందు మోకరిల్లుతుందని అనుకోవడం భ్రమ. అభిమానించవచ్చు. గౌరవించవచ్చు. కానీ రాజకీయంగా అంగీకరించాలంటే పనితీరు కావాలి. చరిత్ర కావాలి. ప్రజల కోసం చేసిన త్యాగం కావాలి.

నేడు దేశ రాజకీయాల్లో వ్యక్తిత్వాల చుట్టూ రాజకీయాలు తిరుగుతున్నాయి. మీడియా మేనేజ్‌మెంట్, సోషల్ మీడియా ప్రచారం, భారీ కటౌట్లు, భారీ సభలు నాయకత్వానికి ప్రత్యామ్నాయాలుగా మారుతున్నాయి. కానీ తెలంగాణ ప్రజలు ఒక విషయం స్పష్టంగా చెబుతున్నారు. ప్రచారం ఎంత పెద్దదైనా ప్రజల జ్ఞాపకాలను చెరిపేయలేరు. ఉద్యమ చరిత్రను మార్చలేరు. అమరుల త్యాగాలను మరిపించలేరు.

పవన్ కళ్యాణ్ రాజకీయాలకు ఇదే అతిపెద్ద సవాలు. ఆయన అభిమానులను ఓటర్లుగా మార్చుకోవాలంటే తెలంగాణ ప్రజల హృదయాలను గెలుచుకోవాలి. దానికి ప్రసంగాలు సరిపోవు. తెలంగాణ సమస్యలపై స్పష్టమైన వైఖరి కావాలి. తెలంగాణ హక్కుల కోసం నిలబడే ధైర్యం కావాలి. కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించే సాహసం కావాలి. సామాజిక న్యాయం కోసం పోరాడే చిత్తశుద్ధి కావాలి. ఇవి లేకుండా కేవలం సినీ ఇమేజ్‌తో రాజకీయాల్లో శాశ్వత స్థానం సంపాదించడం అసాధ్యం.

తెలంగాణ ప్రజలు ఆంధ్రప్రదేశ్ ప్రజలకు వ్యతిరేకులు కాదు. ఈ నేల ఎప్పుడూ ప్రాంతీయ విద్వేషాన్ని ప్రోత్సహించలేదు. కానీ తెలంగాణ గౌరవాన్ని అవమానించే ప్రయత్నాలను కూడా సహించదు. తెలంగాణ చరిత్రను తక్కువ చేసి చూపే ప్రయత్నాలను అంగీకరించదు. తెలంగాణ అమరుల త్యాగాలను రాజకీయ లాభాల కోసం ఉపయోగించుకోవడాన్ని సహించదు.

ప్రజాస్వామ్యంలో చివరికి గెలిచేది నిజాయితీగల రాజకీయమే. కొంతకాలం ప్రచారం పని చేయవచ్చు. కొంతకాలం భావోద్వేగాలు ప్రభావం చూపవచ్చు. కానీ శాశ్వతంగా నిలిచేది ప్రజల కోసం పనిచేసిన నాయకత్వమే. తెలంగాణ చరిత్ర దీనికి సాక్ష్యం. ఉద్యమాలకు అండగా నిలవని పార్టీలు మాయమయ్యాయి. ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకోని నాయకులు చరిత్రలో కలిసిపోయారు. ప్రజల కోసం నిలబడిన వారే గుర్తుండిపోయారు.

అందుకే నేడు తెలంగాణ సమాజం కోరుకుంటున్నది సినిమా హీరోయిజం కాదు. రాజకీయ నటన కాదు. ప్రచార రాజకీయాలు కాదు. ప్రజల సమస్యలను తమ సమస్యలుగా భావించే నాయకత్వం. సామాజిక న్యాయాన్ని అమలు చేసే పాలన. ప్రాంతీయ గౌరవాన్ని కాపాడే రాజకీయ చిత్తశుద్ధి. అమరుల త్యాగాలను గౌరవించే సంస్కారం. తెలంగాణ హక్కుల విషయంలో రాజీపడని ధైర్యం.

నాయకత్వం అనేది తెరపై కనిపించే పాత్ర కాదు. అది ప్రజల జీవితాల్లో మిగిలిపోయే బాధ్యత. సినిమా హాల్లో చప్పట్లు కొట్టించడం ఒక విజయం కావచ్చు. కానీ ప్రజల హృదయాల్లో విశ్వాసం సంపాదించడం అంతకంటే గొప్ప విజయం. తెలంగాణ ప్రజలు ఈ రెండింటి మధ్య తేడాను బాగా అర్థం చేసుకున్న ప్రజలు. అందుకే ఈ నేలపై నాయకత్వానికి ప్రమాణం మాటలు కాదు... చరిత్ర. ప్రచారం కాదు... ప్రజాసేవ. వ్యక్తిగత ప్రతిష్ఠ కాదు... సామాజిక న్యాయం. ఆ ప్రమాణాలను అందుకున్న వారినే తెలంగాణ ప్రజలు తమ నాయకులుగా గుర్తిస్తారు. మిగతా వారిని కాలమే ప్రశ్నిస్తుంది.



మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు

# ఆనందం ఒక గమ్యం కాదు, అది జీవించే ప్రయాణం!

మనిషి జీవితంలో అన్నింటికంటే ఎక్కువగా కోరుకునేది ఒక్కటే ఆనందం. ప్రతి ఉదయం లేచిన దగ్గర నుండి రాత్రి నిద్రపోయే వరకు, మనం చేసే ప్రతి పని వెనక ఒక లక్ష్యం ఉంటుంది సంతోషంగా ఉండటం. కానీ విచిత్రమేమిటంటే, ఆనందాన్ని అన్వేషించే కొద్దీ అది మరింత దూరమవుతున్నట్లు అనిపిస్తుంది. అది ఎందుకు? ఆనందం నిజంగా వెతికితే దొరుకుతుందా? లేదా అది వెతకడంలో కాదు మనల్ని మనం మార్చుకోవడంలో దాగి ఉందా? ఈ ఆధునిక కాలంలో, నిరంతర ఒత్తిడుల మధ్య జీవిస్తున్న మనిషికి అసలైన సుఖాన్ని చేకూర్చే మార్గాలను, మన సంస్కృతి మరియు ఆధునిక విజ్ఞాన శాస్త్రాల వెలుగులో లోతుగా విశ్లేషించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.నేటి యువత నుండి వయోవృద్ధుల వరకు అందరూ ఒక అంతులేని పరుగులో ఉన్నారు. ఉద్యోగం, పెద్ద మొత్తం సంపాదన, సమాజంలో పేరు, ప్రతిష్ఠ ఇవన్నీ సాధిస్తే జీవితంలో పరిపూర్ణమైన ఆనందం దొరుకుతుందని బలంగా నమ్ముతున్నారు. కానీ తీరా అనుకున్న లక్ష్యం చేరుకున్న తర్వాత కూడా మనసు ప్రశాంతంగా ఉండటం లేదు, అక్కడితో ఆగడం లేదు. వెంటనే మరో పెద్ద కోరిక, దాన్ని అందుకోవడానికి మరో సుదీర్ఘమైన అన్వేషణ మొదలవుతాయి. ఇది నిజంగా ఒక అంతులేని వలయం.మనస్తత్వవేత్తలు ఈ మానసిక స్థితిని "హెడోనిక్ ట్రెడ్‌మిల్" (Hedonic Treadmill) అని పిలుస్తారు. దీని అర్థం ఏమిటంటే, మనిషి బాహ్యంగా ఎంతటి గొప్ప విజయాన్ని లేదా సంపదను పొందినా, తొందరలోనే ఆ స్థితికి అలవాటు పడిపోయి మళ్ళీ పాత సాధారణ స్థాయికే వచ్చేస్తాడు. ఇక్కడ సంతృప్తి అనేది శాశ్వతంగా ఉండదు.

ఒక్కసారి మన గతాన్ని నెమరువేసుకుంటూ ఆలోచించండి చిన్నతనంలో వర్షంలో తడిసినప్పుడు కలిగిన ఆనందం మీకు ఇంకా గుర్తుందా? అమ్మ చేతితో తినిపించిన వేడి అన్నం తినినప్పటి అమాయకపు సంతృప్తి గుర్తుందా? అప్పుడు మనం ఆనందం కోసం ఏ పెద్ద వస్తువులనూ వెతకలేదు. ఏ నగరాలకూ ప్రయాణించలేదు. ఆనందం చాలా సహజంగా, అప్రయత్నంగా మన చెంతకు వచ్చింది. మరి ఆ చిన్ననాటి ఆనందానికీ, నేటి వయోజన జీవితంలోని వెతుకులాటకూ మధ్య ఏమి మారింది? చాలా స్పష్టంగా, మనిషి మారాడు మన నిరీక్షణలు పెరిగాయి, భౌతిక అలవాట్లు మారాయి, సహజత్వాన్ని కోల్పోయాము.భగవద్గీతలో శ్రీ కృష్ణుడు అర్జునుడికి చెప్పిన మాటలు ఈ ఆధునిక జీవన గమనానికి చాలా చక్కగా సరిపోతాయి మరియు ఎంతో అర్థవంతంగా ఉంటాయి."సుఖమాత్యంతికం యత్తత్ బుద్ధిగ్రాహ్యమతీంద్రియమ్"దీని అర్థం, నిజమైన అత్యున్నతమైన సుఖం అనేది బాహ్య ఇంద్రియాల ద్వారా పొందే భోగాల వల్ల కాదు, కేవలం నిర్మలమైన బుద్ధి ద్వారా మాత్రమే అనుభవించేది. ఇది ఏదో కేవలం పుస్తకాలకే పరిమితమైన తాత్విక వాక్యం కాదు ఇది ప్రస్తుత కాలంలో శాస్త్రీయంగా కూడా పూర్తిగా నిరూపితమైన సత్యం.నేటి ఆధునిక న్యూరో సైన్స్ పరిశోధనలు సైతం ఇదే విషయాన్ని ఘంటాపథంగా చెప్తున్నాయి. మనసు ప్రశాంతంగా ఉన్నప్పుడు, అలాగే తోటివారి పట్ల కృతజ్ఞతా భావంతో మెలిగినప్పుడు, మన మెదడులో డోపమైన్ (Dopamine), సెరటోనిన్ (Serotonin), ఆక్సిటోసిన్ వంటి సంతోష హార్మోన్లు స్వయంగా ఉత్పత్తి అవుతాయి. మరి ఈ రసాయనాలను మన ఆలోచనా సరళి ద్వారా మనమే మనలో పుట్టించగలిగే శక్తి ఉన్నప్పుడు, బయటి తాత్కాలిక వస్తువులు, అపరిచిత వ్యక్తులు లేదా అనుకూల పరిస్థితుల మీద నిరంతరం ఆధారపడాల్సిన అవసరమేముంది?ఒక ప్రముఖ బౌద్ధ గురువు ఒకప్పుడు తన శిష్యుడికి ఒక అద్భుతమైన సత్యాన్ని బోధించారు నువ్వు ఆనందాన్ని వెతికే కొద్దీ అది నీ నుండి పారిపోతుంది. ఆ వెతుకులాట పూర్తిగా ఆగిన క్షణమే అది నీకు దొరుకుతుంది. ఇది వినటానికి కొంత వింతగా, పరస్పర విరుద్ధంగా ఉన్నా, దీనిలో లోతైన జీవన సత్యం దాగి ఉంది.నిజానికి ఆనందాన్ని భవిష్యత్తులో ఎక్కడో వెతకడం అంటే మనం ప్రస్తుతం బ్రతుకుతున్న ఈ క్షణాన్ని పూర్తిగా




నిరాకరించడమే అవుతుంది.

ఇప్పుడు కాదు, నాకు ఆ ఉద్యోగం వచ్చిన తర్వాత, లేదా ఆ ఇల్లు కొన్న తర్వాతే సంతోషపడతాను అని మనం మనకు మనమే నిబంధనలు పెట్టుకుంటున్నప్పుడు, మన చేతుల్లో ఉన్న అమూల్యమైన ప్రస్తుత జీవితాన్ని వాయిదా వేస్తున్నాం. ఈ వాయిదా వేసే మనస్తత్వమే కాలక్రమేణా ఒక బలమైన అలవాటుగా మారుతుంది. ఆ తర్వాత అనుకున్న లక్ష్యం చేరినా, మళ్ళీ మరో వాయిదా ముందర తయారవుతుంది. ఇలా నిరంతరం భవిష్యత్తు కోసం ప్రాకులాడుతూ ఉంటే జీవితమంతా శూన్యంగా గడిచిపోతుంది.మరి దీనికి సరైన పరిష్కారమేమిటి? ప్రస్తుత క్షణంలో నూరు శాతం జీవించి ఉండటం దీన్నే ఆధునిక పరిభాషలో "మైండ్‌ఫుల్‌నెస్" (Mindfulness) అంటారు. ఇది ఒక తాత్కాలిక ఫ్యాషన్ కాదు, ఇది ఒక అద్భుతమైన జీవన విధానం. మీరు తినే ప్రతి అన్నపు మెతుకును రుచి చూస్తూ ఆస్వాదించడం, పక్కవారితో మాట్లాడే ప్రతి చిన్న మాటలో హృదయం పెట్టడం, చేతిలో ఉన్న ఏ చిన్న పనినైనా పూర్తిగా లీనమై చేయడం ఇదే నిజమైన ఆనందపు రాజమార్గం.మన తెలుగు సంస్కృతిలో ఒక చక్కని పల్లెటూరి సామెత లేదా మాట ఉంది అందరూ కలిస్తే అది పండుగ.ఆనందం అనేది ఎప్పుడూ కేవలం వ్యక్తిగతంగా, స్వార్థంతో కూడుకున్నదిగా రాదు. అది సజీవమైన బంధాలలో, స్వచ్ఛమైన ప్రేమలో, నిజాయితీ గల మానవ సంపర్కంలో మాత్రమే పుట్టుకొస్తుంది. దురదృష్టవశాత్తూ, నేటి డిజిటల్ యుగంలో సోషల్ మీడియా ద్వారా మనం ప్రపంచవ్యాప్తంగా వందల మందితో నిరంతరం కనెక్ట్ అవుతున్నా, లోలోపల అసలైన ఆత్మీయ సంబంధాలు తగ్గిపోతున్నాయి. సమాజంలో ఒంటరితనం అనే వ్యాధి విపరీతంగా పెరుగుతోంది. స్క్రీన్ వెనక ఎమోజీలతో నవ్వుతున్నా, అంతరంగంలో మనిషి మనసు ఏడుస్తూనే ఉంది.ప్రసిద్ధ హార్వర్డ్ విశ్వవిద్యాలయం దాదాపు 80 సంవత్సరాల పాటు నిరంతరాయంగా నిర్వహించిన "గ్రాంట్ స్టడీ" (Harvard Study of Adult Development) అనే చారిత్రాత్మక పరిశోధన ఒక అద్భుతమైన ముగింపునకు వచ్చింది. మనిషిని దీర్ఘకాలం పాటు ఆరోగ్యంగా, అత్యంత సంతోషంగా ఉంచేవి కేవలం వారు సంపాదించిన అపారమైన సంపద కాదు, సమాజంలో సాధించిన సాఫల్యం అంతకన్నా కాదు, కేవలం కుటుంబంతో మరియు స్నేహితులతో ఉన్న మంచి ఆత్మీయ సంబంధాలే అని తేల్చింది.అధిక సంపద, విలాస వస్తువులు తాత్కాలిక భ్రమ అయితే ఉన్నదానితో తృప్తి చెందడం శాశ్వత వాస్తవం! డిజిటల్ ఫాలోవర్లు, లైకులు తాత్కాలిక భ్రమ అయితే ఆత్మీయమైన కుటుంబం, స్నేహితులు శాశ్వత వాస్తవం!భవిష్యత్తు గురించిన నిరంతర ఆందోళన తాత్కాలిక భ్రమ అయితే... ప్రస్తుత క్షణంలో లీనమై జీవించడం (మైండ్‌ఫుల్‌నెస్) శాశ్వత వాస్తవం!దీన్ని నేటికీ మన పల్లెటూరి తెలుగు పెద్దలు అప్రయత్నంగా నిరూపిస్తున్నారు రోజు కష్టపడి వచ్చి సాయంత్రం కుటుంబ సమేతంగా కింద కూర్చుని తినే భోజనం, చిన్నా పెద్దా అని తేడా లేకుండా అందరూ కలిసి నవ్వే పిచ్చాపాటీ విందులు, పండగలకు గుళ్ళో కలిసే సాయంత్రాలు ఇవే మనిషికి లభించే అసలైన ఆనందపు అక్షయ పాత్రలు.

అమెరికన్ మనస్తత్వవేత్త రాబర్ట్ ఎమ్మన్స్ చేసిన సుదీర్ఘ పరిశోధనలలో ఒక ఆసక్తికరమైన విషయం తేలింది. ఎవరైతే రోజూ తమ జీవితంలో జరిగిన మంచి విషయాలను గుర్తుచేసుకుంటూ కృతజ్ఞతా పత్రిక (Gratitude Journal) రాసుకుంటారో, ఆ వ్యక్తులు ఇతరులకన్నా 25 శాతం ఎక్కువ సంతోషంగా ఉన్నారు. వారు తక్కువ మానసిక, శారీరక అనారోగ్యాలతో బాధపడ్డారు, నిత్యం ఎక్కువ ఉత్సాహంగా జీవించారు.

కృతజ్ఞత అనేది ఒక సాధారణ భావన మాత్రమే కాదు అది మెదడు యొక్క మొత్తం పనితీరునే సానుకూలంగా మారుస్తుంది.తెలుగులో మన పెద్దలు ఇచ్చినందుకు దేవుడికి సంతోషించు, ఇతరుల నుండి తీసుకున్నందుకు కృతజ్ఞత చెప్పు అని నేర్పుతారు. ఇది కేవలం ఒక నీతి వాక్యం కాదు ఇది అద్భుతమైన జీవన విజ్ఞానం. మనం సాధారణంగా ఉన్నదాన్ని చూసి ఆనందించడం మానేసి, లేనిదాన్ని చూసి నిరంతరం కుంగిపోతుంటాం. ఉన్న ఆరోగ్యానికి కృతజ్ఞత చెప్పకుండా, పోయిన చిన్నపాటి శక్తికి బాధపడతాం. ఉన్న చిన్న ఇల్లు ఇస్తున్న ఆశ్రయానికి సంతోషపడకుండా, మరింత పెద్ద భవంతి కోసం రాత్రింబగళ్ళు ఒత్తిడితో కష్టపడతాం. ఈ మనస్థితి మారితే, ఆనందం కోసం వెతకాల్సిన పనిలేదు ఆనందం ఎప్పుడూ అక్కడే ఉంది, కేవలం మన చూసే దృష్టి మారాలి.దీనికి తోడు, మన పూర్వీకులు ఒక గొప్ప సంస్కృత శ్లోకం ద్వారా సమాజానికి దిశానిర్దేశం చేశారు."పరోపకారాయ ఫలంతి వృక్షాః, పరోపకారాయ వహంతి నద్యః"అంటే, చెట్లు పరుల కోసం మధురమైన నీడనిస్తాయి, నదులు పరుల దాహం తీర్చడానికి జీవజలాన్ని ఇస్తాయి. ఇది ప్రకృతి యొక్క సహజ ధర్మం. మనిషి కూడా తోటి జీవులకు, సమాజానికి తన వంతు సేవ చేసినప్పుడు మాత్రమే మానసికంగా పూర్తిగా జీవించినట్లవుతాడు.నేడు సమాజంలో మనసు నిండుగా, తృప్తిగా ఉన్న వ్యక్తులను గమనిస్తే, వారిలో ఒక ఉమ్మడి లక్షణం స్పష్టంగా కనిపిస్తుంది వారు ఇతరులకు ఏదో ఒక రూపంలో నిస్వార్థంగా ఇస్తూనే ఉంటారు. అది ఆకలితో ఉన్నవారికి అన్నదానం కావచ్చు, పేద పిల్లలకు చదువు చెప్పడం కావచ్చు, లేదా తీవ్ర నిరాశలో ఉన్న ఒక తోటి మనసుకు ఓదార్పు మాటలు చెప్పడం కావచ్చు. ఇతరులకు సేవ చేసినప్పుడు మనసులో కలిగే ఆ అద్భుతమైన సంతుష్టిని, ప్రపంచంలో ఏ డబ్బుతోనూ కొనలేము. దీన్ని సైన్స్ కూడా ధృవీకరించింది నిస్వార్థమైన సేవా కార్యక్రమాలలో పాల్గొన్నప్పుడు మెదడులో "హెల్పర్స్ హై" (Helper's High) అనే ప్రత్యేకమైన, పరమానందకరమైన అనుభూతి కలుగుతుంది.చివరగా తెలుసుకోవలసిన సత్యం ఏమిటంటే, ఆనందం అనేది భవిష్యత్తులో ఎక్కడో చేరుకోవాల్సిన ఒక గమ్యస్థానం కాదు అది మనం సాగించే ఈ నిత్య ప్రయాణ విధానం. అది రేపటి భవిష్యత్తులో లేదు, జరిగిపోయిన నిన్నటి గతంలోనూ లేదు అది ఖచ్చితంగా ఈ క్షణంలో, ఇక్కడే ఉంది.మీరు ఇప్పుడు ప్రశాంతంగా పీల్చే ప్రతి శ్వాసలో ఆనందం ఉంది.మీ పక్కనే ఉన్న మీ కుటుంబ సభ్యుడి లేదా స్నేహితుడి అమాయకపు నవ్వులో ఉంది.మీరు ప్రస్తుతం పూర్తి శ్రద్ధతో చేస్తున్న చిన్న పనిలో ఉంది.కాబట్టి, ఆనందం కోసం బయట ఎక్కడో వెతకడం పూర్తిగా ఆపండి. మీ చుట్టూ ఉన్న చిన్న చిన్న అద్భుతాలను గమనించడం మొదలుపెట్టండి. ఉన్నదానికి కృతజ్ఞతగా ఉండండి. తోటివారిని నిర్మలంగా ప్రేమించండి. వీలైనంతగా సమాజానికి సేవ చేయండి. అప్పుడు ఆనందం మీకు ఎక్కడో దొరకడం కాదు మీరే ఒక ఆనంద స్వరూపంగా మారిపోతారు. అదే మనిషి జన్మకు నిజమైన సార్థకత, అదే అసలైన ఆనందమయ జీవితం.



డా .సూర్యదేవర రామకృష్ణ , Moral Philosopher,
9490754169

## మర్పల్లి లో హోటల్ భవనం పైకప్పు కూలీ 4గురు గాయపడిన ఘటన పై విచారం వ్యక్తం చేసిన రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ

**హైదరాబాద్ వెలుతురు జూన్ 06:**



వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల కేంద్రంలో ఉన్న హోటల్ భవనం పైకప్పు కూలి 4గురు గాయపడిన ఘటన లో క్షతగాత్రులను సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికీ తరలించారు. గాయపడిన వారిలో ఇద్దరు స్థానిక ప్రవేట్ ఆసుపత్రి కి వెళ్ళారు. మిగిలిన ఇద్దరు సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ను ఆదేశించారు. ప్రవేట్ ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న మరో ఇద్దరి ఆరోగ్య పరిస్థితి పై DMHO ను మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు వారికి మెరుగైన వైద్య సేవలను అందించేందుకు కృషి చేయాలని మంత్రి మంత్రి దామోదర్ రాజనర్సింహ కోరారు.

# అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం జన్మదిన వేడుకలు

- సిపిఐ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన నేతలు
- పార్టీ కార్యకర్తలతో ఉత్సాహంగా జరిగిన కార్యక్రమం
- జిల్లా, మండల స్థాయి నాయకుల భారీ పాల్గొనడం
- సామాజిక నాయకుల సమక్షంలో జన్మదిన వేడుకలు
- అంబేద్కర్ చౌరస్తాలో కేక్ కట్ కార్యక్రమం నిర్వహణ
- ఎమ్మెల్సీకి శుభాకాంక్షలు తెలిపిన సిపిఐ శ్రేణులు
- ఐక్యత, సేవా కార్యక్రమాలపై నేతల ప్రసంగాలు
- మండల కమిటీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహణ
- పలువురు సీనియర్ నేతల హాజరు



- పార్టీ శ్రేణుల్లో ఆనంద వాతావరణం

**మునుగోడు వెలుతురు జూన్ 06:**

తెలంగాణ శాసన సభ్యుడు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం జన్మదిన వేడుకలు అంబేద్కర్ చౌరస్తా వద్ద ఘనంగా జరిగాయి. సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేక్ కట్ చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కమిటీ సభ్యుడు సురిగి చలపతి, మాజీ జెడ్పిటిసి గోస్కొండ లింగయ్య, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు ఈదులకంటి కైలాసం, దుబ్బ వెంకన్న, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు ఎండి జానీమియా, ఏఐటిసి మండల అధ్యక్షుడు బెల్లం శివయ్య పాల్గొన్నారు.

అలాగే సామాజిక నాయకులు మల్ల యాదయ్య, నెల్లికంటి రాఘవేంద్ర, చొల్లేటి వెంకటకృష్ణ చారి, నీరుడు సైదులు, పెరమళ్ళ రామలింగయ్య తదితరులు పాల్గొని ఎమ్మెల్సీకి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో ముగిసింది

# హయత్‌నగర్‌లో సాంక్టస్ వరల్డ్ స్కూల్ ఘన ప్రారంభం





**అంతర్జాతీయ ప్రమాణాల విద్యకు శ్రీకారం**

**హయత్‌నగర్, వెలుతురు జూన్ 6:**

హయత్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన సాంక్టస్ వరల్డ్ స్కూల్ గ్రాండ్ ఓపెనింగ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఫిన్లాండ్ కాన్సుల్ జనరల్ ఏరిక్ ఎఎఫ్ హాలస్ట్రాం ముఖ్య అతిథిగా హాజరై పాఠశాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నాణ్యమైన విద్య సమాజ అభివృద్ధికి మూలస్తంభం. సాంక్టస్ వరల్డ్ స్కూల్ వంటి సంస్థలు విద్యార్థుల్లో ప్రపంచ దృష్టికోణాన్ని పెంపొందించి భవిష్యత్ నాయకులను తీర్చిదిద్దుతాయని నేను విశ్వసిస్తున్నాను అన్నారు.సాంక్టస్ వరల్డ్ స్కూల్ యజమాన్యం మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్ర వికాసమే లక్ష్యంగా అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించిన తరగతి గదులు, ప్రయోగశాలలు, క్రీడా సదుపాయాలు మరియు డిజిటల్ లెర్నింగ్ వాతావరణం ఈ పాఠశాల ప్రత్యేకతగా నిలుస్తున్నాయని తెలిపారు.నాలుగు ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన ఈ విద్యాసంస్థలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, ప్రపంచ స్థాయి నైపుణ్యాలను పెంపొందించే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.ఈ సందర్భంగా పలువురు విద్యావేత్తలు, తల్లిదండ్రులు, ప్రముఖులు పాల్గొని పాఠశాల యాజమాన్యానికి అభినందనలు తెలిపారు.

# ప్రైవేట్ ట్రావెల్స్ ప్రతినిధులతో సైబరాబాద్ సీపీ సమావేశం

- విద్యార్థుల భద్రత, ట్రాఫిక్ నిర్వహణ, సాంకేతిక పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి: సైబరాబాద్ సీపీ

**సైబరాబాద్ వెలుతురు జూన్ 06:**





విద్యార్థుల రవాణాను మరింత సురక్షితంగా, పారదర్శకంగా, సాంకేతిక ఆధారితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో చేపట్టిన స్టూడెంట్ మొబిలిటీ ప్రోగ్రామ్ అమలుపై సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్., ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులు, ప్రతినిధులు మరియు సంబంధిత శాఖల అధికారులతో శనివారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయ ఆడిటోరియంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో రవాణా శాఖ అధికారులు, ఆర్టీసీ ప్రతినిధులు, ట్రాఫిక్ పోలీసులు, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (SCSC) సభ్యులు, విద్యా సంస్థల రవాణా నిర్వాహకులు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ విద్యార్థుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్యార్థులను తరలించే ప్రతి వాహనం భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించడంతో పాటు సీసీటీవీ కెమెరాలు, జీపీఎస్ ఆధారిత రియల్‌టైమ్ లొకేషన్ ట్రాకింగ్ వ్యవస్థలు, అత్యవసర భద్రతా పరికరాలతో ఉండాలని తెలిపారు. వాహనాల నిర్వహణ, డ్రైవర్ల అర్హతలు, లైసెన్సులు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తదితర అంశాలపై కఠిన పర్యవేక్షణ అవసరమని పేర్కొన్నారు.సమావేశంలో సైబరాబాద్ పోలీసులు మరియు SCSC సంయుక్తంగా రూపొందించిన స్టూడెంట్ మొబిలిటీ ప్రోగ్రామ్పై ప్రత్యేక ప్రజెంటేషన్ నిర్వహించారు. విద్యార్థుల రవాణాలో ట్రాఫిక్ రద్దీ (Congestion) తగ్గించడం, నిబంధనల అమలు (Compliance), భద్రత (Safety), అందుబాటు ధరల్లో రవాణా సేవలు (Affordability) కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యాలని వివరించారు.స్టూడెంట్ మొబిలిటీ ప్రోగ్రామ్‌లో భాగంగా ప్రత్యేక మొబైల్ అప్లికేషన్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు సీపీ వెల్లడించారు. ఈ యాప్ ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలు ప్రయాణిస్తున్న వాహనానికి సంబంధించిన కీలక సమాచారాన్ని నేరుగా తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. వాహనంలో విద్యార్థుల సంఖ్య నిర్దేశిత పరిమితికి మించి ఉందా లేదా (Overcrowd-ing), వాహనం నడుపుతున్న డ్రైవర్ వివరాలు, డ్రైవింగ్ లైసెన్స్ స్థితి, వాహనం ఫిట్‌నెస్, ప్రయాణ మార్గం, ప్రస్తుత లొకేషన్ వంటి వివరాలు యాప్‌లో అందుబాటులో ఉంటాయని చెప్పారు.అదేవిధంగా కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా విద్యార్థుల రవాణా వాహనాలను రియల్‌టైమ్‌లో పర్యవేక్షించే విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. దీనివల్ల అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించే అవకాశం ఉండటంతో పాటు విద్యార్థుల భద్రత మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.విద్యార్థుల డ్రాపింగ్, పికప్ సేవలు, పాఠశాలలు, కళాశాలలు, కోచింగ్ సెంటర్లు, క్రీడా శిక్షణా కేంద్రాలకు వెళ్లే సమయంలో ఎదురయ్యే రవాణా సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని సీపీ తెలిపారు. ట్రాఫిక్ రద్దీ తగ్గించడం, భద్రతా ప్రమాణాల అమలు, సమర్థవంతమైన రవాణా వ్యవస్థ ఏర్పాటు ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు.సమావేశంలో పాల్గొన్న ప్రైవేట్ ట్రావెల్స్ ప్రతినిధులు ట్రాఫిక్ నిర్వహణ, ఆర్టీఓ అనుమతులు, లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్ మరియు ఇతర కార్యనిర్వహణ అంశాలకు సంబంధించిన సమస్యలను సీపీ దృష్టికి తీసుకువచ్చారు. వాటిపై స్పందించిన సీపీ, సంబంధిత శాఖలతో సమన్వయం చేసి సాధ్యమైన పరిష్కారాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు.భారీ దృష్టికోణంతో రూపొందించిన ఈ కార్యక్రమం ప్రారంభ దశలో కొన్ని చిన్న సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉన్నప్పటికీ, వాటిని అధిగమిస్తూ ముందుకు సాగాలని సీపీ సూచించారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఈ ప్రాజెక్టు విజయవంతమైతే రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపే అవకాశం ఉందని తెలిపారు.విద్యార్థుల భద్రత, తల్లిదండ్రుల విశ్వాసం, సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ, ట్రాఫిక్ నిర్వహణ మరియు సమర్థవంతమైన రవాణా వ్యవస్థను లక్ష్యంగా పెట్టుకుని స్టూడెంట్ మొబిలిటీ ప్రోగ్రామ్‌ను అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.ఈ సమావేశంలో సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్, శేరిలింగంపల్లి ఎడిసిపి హనుమంతరావు, ట్రాన్స్పోర్ట్ ఇన్స్పెక్టర్ శీతల్ సోహన్, మేడ్చల్ డిటిఓ శ్రీనివాస్, ఆర్టీసీ డిఎం మియాపూర్-1 ప్రశాంత్ మియాపూర్ -2 వెంకటేశం ఇతర ఉన్న అధికారులు పాల్గొన్నారు.

# ఇసుక కాంట్రాక్టర్లు అక్రమ దోపిడీ!

- అధికారుల నిర్లక్ష్యం దేనికి సంకేతం!
- ఇసుక ర్యాంపులలో జరుగుతున్న అక్రమ లోడింగ్ డబ్బుల వసూళ్లు వెంటనే ఆపాలి!
- లారీ యజమానులను దోచుకుంటున్న ఇసుక కాంట్రాక్టర్లపై వెంటనే చర్యలు తీసుకోవాలి!
- TGMDC అధికారులు స్పందిస్తారా! లేక ఇసుక కాంట్రాక్టర్లకు సహకరిస్తారా!
- పెద్ద అంబార్ పేట ఇసుక లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు - పోలగోని భాస్కర్ గౌడ్



**పెద్ద అంబార్ వెలుతురు జూన్ 06:**


ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి ఇసుక లారీ TGMDC సంస్థ ద్వారా డీడీ 15,650/- ఒక్కో లారీకి అమౌంట్ కట్టి లోడింగ్ వెళ్లిన ఇసుక లారీల దగ్గర కాంట్రాక్టర్లు బెదిరిస్తూ భయపెడుతూ అందినకాడికి లోడింగ్ పేరుతో అక్రమంగా వసూలు చేస్తున్నారు. Tgmdc సంస్థ ద్వారా వారికి సుమారుగా 3500 నుండి 4000 రూపాయలు వస్తున్నాయి అవి కాకుండా ఒక్కొక్క ఇసుక లారీ దగ్గర 1500 రూపాయల నుండి 2700 రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారు. ఒక్కొక్క లారీ దగ్గర రెండు వైపులా వసూలు చేస్తున్నారని పలువురు లారీ ఓనర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమ లోడింగ్ డబ్బుల వసూలు వల్ల ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి కొడుతున్నారు. ప్రభుత్వంనికి చెడ్డ పేరు తీసుకువతున్నా కాంట్రాక్టర్లు పై తక్షణమే చర్యలు తీసుకోవాలని మనవి. 1. కరీంనగర్ జిల్లాలో ఇసుక ర్యాంప్ లు పోతిరేడ్డి పల్లి, కొండపాక, కొరకల్, ఉటూర్, మల్లారెడ్డి పల్లి ఇసుక ర్యాంప్ లలో కాంట్రాక్టర్లు ఒక్కొక్క లారీ దగ్గర లోడింగ్ పేరుతో 2100 రూపాయలు కాంట్రాక్టర్లు అక్రమంగా వసూలు చేస్తున్నారు. 2. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో లోడింగ్ పేరుతో 2000 రూపాయలు, కాంట పేరుతో 500 రూపాయలు, జేసీబీ ఆపరేటర్ కి 200 రూపాయలు అన్ని కలిపి 2700 రూపాయలు వసూలు చేస్తున్నారు. 3. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇసుక ర్యాంప్ లలో లోడింగ్ కి 1600 రూపాయలు కాంట పేరుతో 500 రూపాయలు, జేసీబీ ఆపరేటర్ పేరుతో 200 రూపాయలు మొత్తం కలిపి 2300 రూపాయలు వసూలు చేస్తున్నారు. వివిధ జిల్లాలో ఉన్న PO (ప్రాజెక్టు అధికారులు) లకు సమాచారం చెప్పిన పట్టించుకోకుండా ఫోన్ బ్లాక్ లిస్టులో పెట్టుకొని కాంట్రాక్టర్లకి సహకరిస్తున్నారు. అలాగే TGMDC స్టాక్ యార్డ్ ఇంచార్జిలు (SRA) ఒక్కరు కూడా డ్రైవర్లు ఫోన్ చేసిన మాట్లాడేది లేదు ఇసుక లారీ ఓనర్స్ ఫోన్ చేసిన మాట్లాడేది లేదు అంత PO గారి కనుసన్నల్లోనే అక్రమంగా ఇసుక లారీల దగ్గర లోడింగ్ పేరుతో అందినకాడికి దోసుకుంటున్నారు. లారీల దగ్గర ఒక జలగా లాగా వేదించుకు తీసుకుంటున్నారు.

PO మరియు SRA లు పూర్తిగా కాంట్రాక్టర్లు సహకరిస్తున్నారు కావున అట్టి అధికారులపై చర్యలు తీసుకోవాలని అక్రమ లోడింగ్ డబ్బులను పూర్తిగా అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో బలరాం గౌడ్, నర్సింహా , రవీందర్, శ్రీను, ప్రవీణ్, నర్సింహా, శేఖర్, రమేష్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు నష్టపరిహారం ఇవ్వకుండా దౌర్జన్యంగా అక్రమంగా కోహెడ ఫ్రూట్ మార్కెట్ శంకుస్థాపన చేయడాన్ని బీఆర్ఎస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నాం

- బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు దండెం రాంరెడ్డి

**ఇబ్రహీంపట్నం వెలుతురు జూన్ 06:**



ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు దండెం రాంరెడ్డి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోఫ్రూట్ మార్కెట్ నిర్మాణానికి 170 ఎకరాలు కేటాయించి చ దును చేసి మరియు డిపిఆర్ చేసిన భూమిని వదిలిపెట్టి సర్వేనంబర్ 167లో రైతులు సాగు చే స్తున్న భూములను ఫ్రూట్ మార్కెట్ నిర్మాణానికి కేటాయించడం కాంగ్రెస్ ప్రభుత్వమూర్ఖ త్వం గౌ రవ ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి వారి చేతుల మీదుగా కోహెడ ఫ్రూట్ మార్కెట్ ను శంకుస్థాపన చేస్తున్నారు మార్కెట్ శంకుస్థాపన చేయడం మంచిదే మార్కెట్ అభివృద్ధి అవ్వడం ద్వారా పరిసర ప్రాంతాలు కూడా అభివృద్ధి చెందుతాయి కానీ 170 ఎకరాల ఒక లెవెల్ భూమిని వదిలిపెట్టి సర్వేనంబర్ 167లో రైతులు సాగు చేస్తున్న భూములను మార్కెట్ నిర్మాణానికి కేటా యించడం కాంగ్రెస్ ప్రభుత్వ మూర్ఖత్వం అదేవిధంగా రైతుల భూములు తీసుకొని వారికి నష్టపరిహారం ఇవ్వకుండా దౌర జ న ్యంగా శంకుస్థాపన చేయడం అ న్యాయ ంవెంట నే రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆతర్వాతే మార్కెట్ నిర్మాణంచేపట్టాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన తెలుపుతున్నాము లేని పక్షంలో రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ పార్టీ తరపున పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు ధర్నా కార్యక్రమాలు చేపడతాం అని హెచ్చరించారు అక్రమంగా అరెస్టు చేసిన నాయకులను పరామర్శించారు సందర్భంగామాట్లాడుతూ రైతులకు మద్దతుగా నష్ట పరిహారం చెల్లించాలని అడిగినం దుకు మీసొంత (కాంగ్రెస్) పార్టీకి చెందిన మాజీ కౌన్సిలర్లను మరియు రైతులనుఇతర పార్టీల నాయకులను అరెస్ట్ చేయడం సిగ్గుచేటు ఈ అరెస్టులను మేము తీవ్రంగా ఖండిస్తున్నాం అన్నారు.

## డివిజన్లోని ఆగిపోయి ఉన్నా పనులను సిసి రోడ్, స్ట్రీట్ లైట్స్ లను వెంటనే పూర్తి చేయాలి

- ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ సంతోష్ ని కలిసిన మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్



**హైదరాబాద్ వెలుతురు జూన్ 06:**

శనివారం రోజున హిమాయత్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ సంతోష్ గారిని కలిసి డివిజన్లోని ఆగిపోయి ఉన్నా పనులను సిసి రోడ్, స్ట్రీట్ లైట్స్ మరియు మొదలైన విషయాల గురించి వినతి పత్రం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహేష్, శేఖర్, రాజేంద్ర గౌడ్, లాస్య, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## నీట్ వైఫల్యం, ధరల పెంపుపై కేంద్రంపై మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

- ఎల్పీజీ, పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై తీవ్ర అభ్యంతరం
- సామాన్యులపై కేంద్రం భారాన్ని మోపుతోందని మండిపాటు

**హైదరాబాద్ వెలుతురు జూన్ 06:**

లిబర్టీ సర్కిల్ వద్ద జరిగిన కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. నీట్ యూజీ 2026 పరీక్షలో పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో పరీక్ష రద్దు కావడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని ఆయన అన్నారు.దేశవ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్రం చెలగాటమాడుతోందని ఆరోపించారు. విద్యార్థులు నెలల తరబడి కష్టపడి సిద్ధమవుతే, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వారి శ్రమ వృథా అయిందని వ్యాఖ్యానించారు.నీట్ పరీక్ష వైఫల్యానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా పాలన ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన వెంటనే కేంద్ర ప్రభుత్వం ఎల్పీజీ, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి సామాన్యులపై భారాన్ని మోపిందని విమర్శించారు.

## 112 కాల్‌తో యువకుడి ప్రాణాలు కాపాడిన జహీరాబాద్ రూరల్ పోలీసులు

- వెంటనే స్పందించిన కానిస్టేబుళ్లను అభినందించిన ఎస్సై కాశీనాథ్...

**జహీరాబాద్ వెలుతురు, జూన్ 06:**




కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఆత్మహత్యా యత్నానికి పాల్పడుతున్నాడన్న సమాచారంపై 112 అత్యవసర సేవలకు కాల్ అందడంతో జహీరాబాద్ రూరల్ పోలీసులు వెంటనే స్పందించి అతని ప్రాణాలను కాపాడారు.

సంగారెడ్డి జిల్లా పొట్పల్లి గ్రామానికి చెందిన గంగారం అశోక్ (34), తండ్రి ఏసప్ప, కుటుంబ సమస్యల కారణంగా ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాడని సమాచారం అందడంతో పోలీసులు తక్షణమే సంఘటన స్థలానికి చేరుకున్నారు. అప్రమత్తంగా వ్యవహరించిన పోలీసులు అశోక్‌ను సురక్షితంగా రక్షించి జహీరాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

అనంతరం ఎస్సై ఎం. కాశీనాథ్ సమక్షంలో అశోక్‌కు కౌన్సిలింగ్ నిర్వహించారు. కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలతో మాట్లాడించి సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టారు. అనంతరం అతడిని గ్రామ పెద్దలకు అప్పగించారు.

ఈ సందర్భంగా అత్యవసర సమాచారంపై వేగంగా స్పందించి యువకుడి ప్రాణాలను కాపాడిన జహీరాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుళ్ల సేవలను ఎస్సై ఎం. కాశీనాథ్ అభినందించారు. ప్రజలు ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లోనైనా 112 సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

## సనాతన హిందూ ధర్మ సేవా సమితి ఆధ్వర్యంలో చెస్ క్రీడ పోటీలు



విజేతలకు బహుమతులు ప్రధానం చేసిన కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి ప్రకాష్

**కరీంనగర్ వెలుతురు జూన్ 06:**

సనాతన హిందూ ధర్మ సేవా సమితి ఆధ్వర్యంలో 50 రోజుల పాటు విజయవంతంగా చెస్ క్రీడా శిక్షణ తరగతులు చేపట్టారు. చెస్ క్రీడా కోచ్ కొప్పర్తి శివయ్య పర్యవేక్షణలో చెస్ తరగతులను రెండు విడతలలో నిర్వహించారు. చెస్ కాంపిటీషన్లో గెలుపొందిన విద్యార్థులకు, చిన్నారులకు శనివారం రోజున ముఖ్యఅతిథి 49 వ డివిజన్ కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి ప్రకాష్ బహుమతుల ప్రధానం చేశారు. చెస్ క్రీడల్లో విజేతలుగా నిలిచిన చిన్నారులు కె.అవిష ( మొదటి), ఎన్ సాయి (రెండవ) , కార్తికేయ మూడో బహుమతి ని కార్పొరేటర్ ఎన్నం లక్ష్మీ ప్రకాష్ చేతుల మీదుగా అందుకున్నారు. ప్రధానంగా వేసవి సెలవుల్లో పిల్లలను ప్రోత్సహించడానికి చెస్ క్రీడ పోటీలను, కూచిపూడి, భరతనాట్యం లాంటి కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని సనాతన హిందూ ధర్మా సేవా సమితి బాధ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సనాతన హిందూ ధర్మ సేవా సమితి నిర్వాహకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు జీనియస్ చెస్ అకాడమీ క్రీడాకారులు

**కరీంనగర్ వెలుతురు జూన్ 06:**



కరీంనగర్ భగత్ నగర్ లోని చైతన్య యూత్ క్లబ్ లో శనివారం జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా అండర్ 9 చదరంగం పోటీలలో జీనియస్ చెస్ అకాడమీ క్రీడాకారులు బాలికల విభాగంలో ఎం .సాన్విత, జీ.తాన్వి, ఎన్ .సాన్విత, ఎల్ ,అద్వైత బాలుర విభాగంలో హీమాన్స్ రావు , కె. స్నితిక్ రెడ్డి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులను జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకులు కంకటి కనకయ్య అకాడమీ డైరెక్టర్ సీనియర్ కోచ్ కంకటి అనూప్ కుమార్ అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో కూడా గెలుపొంది జాతీయస్థాయికి ఎంపిక కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.గెలుపొందిన క్రీడాకారులు ఈనెల 14 నుండి 16 వరకు హైదరాబాదు ఎల్బీ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి చరంగం పోటీల్లో ఆడనున్నారు. ఈ కార్యక్రమంలో డెమొక్రటిక్ చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శులు కంకటి సృజన కుమార్, తాటిపల్లి సతీష్ బాబు, కోచ్ అభిరాం తదితరులు పాల్గొన్నారు

## ధాన్యం దిగుమతుల ఆలస్యంపై అన్నదాత ఆగ్రహం

- తోటపల్లిలో రాజీవ్ రహదారిపై ఆందోళన
- మిల్లు వద్ద వాహనాల బారులు

**బెజ్జంకి,వెలుతురు జూన్ 06:**



కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించినా.. దాన్ని మిల్లుల్లో దిగుమతి చేసుకోవడంలో ఆలస్యం చేయడంపై రైతులు ఆవేదన చెందుతున్నారు. దీనిపై సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం తోటపల్లిలో శనివారం ఆందోళనకు దిగారు. వరి ధాన్యం బస్తాలను అన్‌లోడ్ చేయడానికి మూడ్రోజులుగా రైతులు వాహనాలతో గోదాము వద్ద నిరీక్షిస్తున్నారు. బెజ్జంకి మండల కేంద్రంలో ఏఎంసీ గోదాం నిండిపోవడంతో మరో మిల్లుకు తరలించాలని రైతులకు అధికారులు సూచించారు. దాంతో ఆయా గ్రామాల నుంచి ధాన్యం బస్తాల వాహనాలతో అధికారులు సూచించిన మిల్లుకు వెళ్తే.. తమకు ఎలాంటి ఆదేశాల్లేవని యాజమాన్యం చెప్పడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బెజ్జంకి మండల పరిధిలోని తోటపల్లి గ్రామ శివారులోని శ్రీలక్ష్మీ రైస్ మిల్లు ఎదుట రాజీవ్ రహదారిపై బైటాయించారు.

# అమృత్‌సర్‌లోని అకాల్ తఖ్త్ వద్ద ఉద్రిక్తత

- ఆపరేషన్ బ్లూ స్టార్ ఘటన నేపథ్యంగా భద్రత కట్టుదిట్టం
- ఖలిస్థాన్ అనుకూల నినాదాలతో వాతావరణం వేడెక్కింది
- జర్నైల్ సింగ్ భింద్రన్‌వాలే పోస్టర్ల ప్రదర్శన
- ఘల్లోఘూరా దివస్ సందర్భంగా ప్రత్యేక ఆచరణలు
- పంజాబ్ పోలీసులు భారీ భద్రతా బలగాల మోహరింపు
- సుమారు 4,000 మంది పోలీసులతో రక్షణ ఏర్పాట్లు
- అధికారుల పర్యవేక్షణలో అమృత్‌సర్ నగరం
- శాంతి భద్రతలపై ప్రత్యేక డీజీపీ సమీక్ష
- భింద్రన్‌వాలే చరిత్రపై మళ్లీ చర్చకు దారితీసిన ఘటన

**అమృత్‌సర్ ,వెలుతురు జూన్ 06:**



పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ఉన్న ప్రముఖ సిక్కు మత కేంద్రం అకాల్ తఖ్త్ వద్ద గురువారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. జూన్ 6వ తేదీని కొంతమంది వర్గాలు 'ఘల్లోఘూరా దివస్'గా పాటిస్తున్న నేపథ్యంలో, అక్కడ భద్రతా పరిస్థితులు మరింత కట్టుదిట్టం చేశారు.

ఈ సందర్భంగా కొందరు కార్యకర్తలు ఖలిస్థాన్ అనుకూల నినాదాలు చేయడం, అలాగే సిక్కు మిలిటెంట్ నాయకుడు జర్నైల్ సింగ్ భింద్రన్‌వాలే పోస్టర్లు ప్రదర్శించడం ఉద్రిక్తతకు కారణమైంది. ఈ ఘటనతో పరిసర ప్రాంతాల్లో ఉద్వేగభరిత పరిస్థితులు నెలకొన్నాయి.

జర్నైల్ సింగ్ భింద్రన్‌వాలేను కొంతమంది సిక్కు సమాజ వర్గాలు అమరవీరుడిగా భావిస్తే, మరికొందరు ఆయనను పంజాబ్‌లో జరిగిన తీవ్రవాద ఉద్యమానికి ప్రతీకగా చూస్తారు. ఈ భిన్న అభిప్రాయాల కారణంగా ప్రతి సంవత్సరం ఈ తేదీ చుట్టూ వాతావరణం సున్నితంగా మారుతుంది.

ఈ నేపథ్యంలో పంజాబ్ పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. అమృత్‌సర్ నగరం మరియు పరిసర ప్రాంతాల్లో విస్తృత భద్రతా ఏర్పాట్లు చేశారు. శాంతి భద్రతలను కాపాడేందుకు సుమారు 4,000 మంది పోలీసు సిబ్బందిని మోహరించారు.

రాష్ట్ర శాంతి భద్రతల ప్రత్యేక డైరెక్టర్ జనరల్ ప్రవీణ్ కుమార్ సిన్హా పరిస్థితిని సమీక్షించేందుకు జూన్ 4న అమృత్‌సర్‌లో పర్యటించారు. భద్రతా బలగాల మోహరింపును ఆయన స్వయంగా పరిశీలించి, అవసరమైన సూచనలు జారీ చేశారు.

ఈ సమయంలో ఆపరేషన్ బ్లూ స్టార్ నేపథ్యంలో సున్నిత పరిస్థితులు మరింత జాగ్రత్త అవసరమని అధికారులు భావిస్తున్నారు. గత చరిత్ర కారణంగా ఈ ప్రాంతంలో ప్రతి సంవత్సరం ఈ తేదీకి ముందు, తర్వాత భద్రతను మరింత పెంచుతారు.

అమృత్‌సర్‌లోని వాతావరణం ప్రస్తుతం నియంత్రణలో ఉన్నప్పటికీ, పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిరంతరం గస్తీ నిర్వహిస్తున్నారు. ప్రజలు శాంతి భద్రతలకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఈ ఘటనతో మళ్లీ ఆపరేషన్ బ్లూ స్టార్ చరిత్ర, భింద్రన్‌వాలే పాత్ర, అలాగే పంజాబ్‌లో అప్పటి పరిస్థితులపై రాజకీయ, సామాజిక చర్చలు ఊపందుకున్నాయి.

# రైతులకు సరైన నష్టపరిహారం అందించాలి

- ఫ్యూచర్ సిటీలో వసతి నివాసాలు కల్పించాలి
- ఫ్యూచర్ సిటీలో మొదట యువతకు అవకాశం ఇవ్వాలి
- ఫ్యూచర్ సిటీపై రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు

**అంబర్‌పేట,వెలుతురు జూన్ 06:**



రైతులకి సరైన నష్టపరిహారం అందించాలని, వారికి ఫ్యూచర్ సిటీలో వసతి నివాసాలు కల్పించాలని, ఫ్యూచర్ సిటీలో మొదట యువతకు అవకాశం ఇవ్వాలని, ఫ్యూచర్ సిటీపై రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు మేధావులు, వక్తలు అభిప్రాయాలు తెలియజేశారు. శనివారం హైదరాబాద్ లకిడికాపూల్‌లోని సెంట్రల్ కోర్ట్ హోటల్‌లో రాష్ట్రీయ లోక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో ఫ్యూచర్ సిటీ అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రాష్ట్రీయ లోక్ దళ్ జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి త్రిలోక్ త్యాగి మాట్లాడుతూ, తమ పార్టీ విధానాలు మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్ సిద్ధాంతాలపై ఆధారపడి ఉన్నాయని, ఆయన చెప్పిన "గ్రామీణ వికాస్ – దేశ్ కా వికాస్" సిద్ధాంతాన్ని గుర్తు చేశారు. ఫ్యూచర్ సిటీ పేరుతో రైతులను, గ్రామాలను నాశనం చేయరాదని, భూములు కోల్పోయే రైతులకు తగిన నష్టపరిహారం, ఉపాధి అవకాశాలు, సరసమైన ప్రత్యామ్నాయ నివాసాలు కల్పించాలని కోరారు.ప్రముఖ ఆర్థికవేత్త ప్రొఫెసర్ మనోహర్ మాట్లాడుతూ, హైదరాబాద్‌కు ఫ్యూచర్ సిటీ భావన స్వాగతించదగ్గదేనని, అయితే సమాజంలోని అన్ని వర్గాలకు, ముఖ్యంగా సేవారంగానికి ప్రాధాన్యం కల్పించాలని సూచించారు. సరైన ప్రణాళిక లేకపోవడం వల్ల కోల్‌కతా, చెన్నై వంటి మహానగరాలు నేడు క్షీణత దిశగా పయనిస్తున్నాయని పేర్కొన్నారు.

సీపీఐ (ఎంఎల్) కార్యదర్శి హన్మేష్ మాట్లాడుతూ, దేశంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలు కేవలం 15–20 శాతం ప్రజలకు మాత్రమే ప్రయోజనం చేకూరుస్తున్నాయని, మిగిలిన 80 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయని అన్నారు. ఆధునిక కాలంలో ఈ వర్గాల ఆకాంక్షలు పెరిగాయని, ఫ్యూచర్ సిటీ రూపకల్పనలో వారి అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. మాజీ బీసీ కమిషన్ సభ్యుడు, బీజేపీ నాయకుడు తల్లోజు ఆచారి మాట్లాడుతూ, మహబూబ్‌నగర్ జిల్లాలోనే ఫార్మా సిటీ, ఏరో సిటీ, ఫ్యాబ్ సిటీ, స్పోర్ట్స్ హబ్, ఎడ్యుకేషన్ అండ్ హెల్త్ సిటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ జోన్, ఏఐ జోన్ వంటి పథకాల కోసం సుమారు 50 వేల ఎకరాల భూమిని సేకరించారని తెలిపారు. అయితే వాటిలో 10 శాతం కూడా అభివృద్ధి కాలేదని, అనేక మంది రైతులకు ఇంకా సరైన నష్టపరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యూచర్ సిటీ కూడా కేవలం భూసేకరణకే పరిమితమయ్యే ప్రమాదం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం అన్ని వర్గాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సమగ్ర పరిష్కారం తీసుకురావాలని కోరారు. వ్యవసాయ ప్రొఫెసర్ డాక్టర్ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ, ఫ్యూచర్ సిటీ భావనను స్వాగతిస్తున్నామని, అయితే అది సమాజంలోని అన్ని వర్గాలకు స్వయం సమృద్ధిని కల్పించే విధంగా ఉండాలని సూచించారు. ఈ అంశంపై చర్చను ప్రారంభించిన రాష్ట్రీయ లోక్ దళ్‌ను అభినందించారు.

మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడుతూ ఫ్యూచర్ సిటీ స్వయం సమృద్ధి, సమ్మిళిత అభివృద్ధికి ప్రతీకగా ఉండాలన్నారు. సేవారంగానికి తగిన అవకాశాలు, అందుబాటు గృహవసతి కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. శాన్ ఫ్రాన్సిస్కో, రోమ్ వంటి అంతర్జాతీయ నగరాలతో పాటు, భారతదేశంలోని ప్రణాళికాబద్ధ నగరమైన చండీగఢ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ప్రతీ ఒక్కరి అభిప్రాయ భేదాలు తీసుకోవాలని, ప్రతీ ఒక్కరితోనే చర్చించాలని ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం దృష్టి సారించాలని, స్థానిక యువతకు పెద్దపీట వేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ అధ్యక్షుడు కపిలవాయి దిలీప్ కుమార్ మాట్లాడుతూ ఈ రౌండ్ టేబుల్ సమావేశం ద్వారా మేధావులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రముఖ పౌరుల అభిప్రాయాలను సేకరించడం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. సమావేశంలో వచ్చిన సూచనలు, అభిప్రాయాలను సమగ్రంగా రూపొందించి ప్రభుత్వం సంబంధిత అధికారులకు త్వరలో అందజేస్తామని హామీ ఇచ్చారు.వీవీఎస్ బంధా కవి మాట్లాడుతూ, ప్రస్తుతం ఫ్యూచర్ సిటీ రాష్ట్రంలో అత్యంత చర్చనీయాంశంగా మారిందని, ఈ నేపథ్యంలో ప్రముఖుల అభిప్రాయాలను సేకరించి, వాటి ఆధారంగా సమగ్ర కాన్సెప్ట్ పేపర్ రూపొందించి సంబంధిత అధికారులకు సమర్పించనున్నట్టు తెలిపారు.

లైబ్రరీ కార్పొరేషన్ చైర్మెన్ డాక్టర్ మొహమ్మద్ రియాజ్ మాట్లాడుతూ, అనుకూల, ప్రతికూల అభిప్రాయాలను సమానంగా స్వాగతిస్తున్నామని చెప్పారు. ఫ్యూచర్ సిటీ ప్రస్తుత ప్రభుత్వ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని, హైదరాబాద్ నగరానికే విస్తరణ, అభివృద్ధికి అత్యధిక అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. స్వయం సమృద్ధి, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలతో ఫ్యూచర్ సిటీని నిర్మించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ సమావేశంలో వచ్చిన విలువైన సూచనలనుముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ యువజన అధ్యక్షుడు రాజ్ కుమార్ రెడ్డి, పార్టీ అధికార ప్రతినిధి గౌర బీరప్ప సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శులు విశాల్ వంజారి, రిషబ్ జైన్, నరసింహారావు, కోశాధికారి గిరి కుందే, కార్యదర్శి ఓంకార్ గౌడ్, చారి,జాని,సతీష్ కట్టా, సోమగాని నరేందర్ గౌడ్ జూపల్లి రాములు బియ్యాల కృష్ణ, కోటేశ్వర్,విక్రమ్ శర్మ తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్కు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామీణ ఉపాధి హామీ పాత చట్టాన్ని కొనసాగించాలి

**హైదరాబాద్ ,వెలుతురు జూన్ 06:**




వీబీజీ రామ్ చట్టాన్ని రద్దు చేసి గ్రామీణ ఉపాధి హామీ పాత చట్టాన్ని కొనసాగించాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్ లోని సంఘం కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య అధ్యక్షతన ప్రారంభమైన రాష్ట్ర కమిటీ సమావేశాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఢిల్లీలోని మోడీ ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, మేధావులతో చర్చించకుండా ఉపాధి హామీ చట్టం స్థానంలో తెచ్చిన విబీజీ రామ్ జి చట్టాన్ని అమలు చేయడానికి గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడం ప్రభుత్వ నియంతృత్వ చర్యలకు నిదర్శనమని పేర్కొన్నారు. కొత్త చట్టం పేదల పని హక్కును నాశనం చేసేదని ఆందోళన వ్యక్తం చేశారు. 90శాతం కేటాయించే నిధుల్లో 60 శాతం ఇవ్వడం వల్ల రాష్ట్రాలతో పాటు కూలీలు కూడా నష్ట పోతారని అన్నారు. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం ద్వారా ఉదయం, సాయంత్రం ఫోటోల పేరుతో కూలీలను వేధించడం ఆపాలని డిమాండ్ చేశారు.

కొత్త చట్టాన్ని కేంద్రం ఏక పక్షంగా అమలు చేయాలని చేసే ప్రయత్నాలకు నిరసనగా ఈ నెల 17న ఢిల్లీ కేంద్రంగా ప్రజాసంఘాలు మేధావులతో విస్తృత సమావేశాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అలాగే జూన్ 16,17న రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, మండల, జిల్లా కేంద్రాల్లో చర్చా గోష్టులు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్ రాములు, ఉపాధ్యక్షులు బి ప్రసాద్, బి పద్మ, పొన్నం వెంకటేశ్వరరావు, కొండమడుగు నరసింహ, ములకలపల్లి రాములు, పెద్ది వెంకట రాములు, రాష్ట్ర సహాయ కార్యదర్శి నారి ఐలయ్య, మచ్చా వెంకటేశ్వర్లు, సాంబశివ, నరసింహులు, వెంకటయ్య, శశిధర్, సమ్మయ్య, ఆవుల వీరన్న, రమేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



## 9వ వార్డులో డ్రైనేజీ పనుల ప్రారంభం

**నార్కట్ పల్లి వెలుతురు జూన్ 06:**

నార్కెట్‌పల్లి గ్రామపంచాయతీ 9వ వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి స్థానిక సర్పంచ్ జెరిపోతుల భారత్ కుమార్ మరియు 9వ వార్డు సభ్యుడు నడింపల్లి నరేష్ యాదవ్ కలిసి ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డులో నెలకొన్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు నూతన డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు మెరుగైన పారిశుధ్య సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపడటంతో వార్డులో మురుగునీటి సమస్యలు తగ్గి ప్రజలకు ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 6వ వార్డు సభ్యుడు బాకారం జనార్దన్, నవీన్, పంచాయతీ కార్యదర్శి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన సర్పంచ్ గర్దాస్ విక్రమ్



**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 06:**

100 రోజుల టీబీ స్క్రినింగ్ కార్యక్రమంలో భాగంగా ఈరోజు ఇంద్రపాలనగరంలో అనుమానిత టిబి వ్యాధి గ్రస్థులకు ఎక్రే తీయడం జరుగుతుంది. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరడం జరిగింది.ఈ కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శి నరేందర్, వార్డ్ సభ్యులు, సీనియర్ నాయకులు సింగణబోయిన జంగయ్య, జిట్టబోయిన వెంకటేష్, గోళ్లేపల్లి యాదయ్య, బొల్ల నర్సింహా, ఎర్రం దాస్,మంటి బిక్షపతి, శివగల్ల ముత్యాలు, పగుడాల రామచంద్రం, వైద్య అధికారులు జి. గోపాల్ హెచ్ ఇ ఓ ఎం వాణిశ్రీ సూపర్ వైజర్. వి. అరుంధతి ఏఎన్ఎం. జానకమ్మ ఎస్ టి ఎస్ అశ్విని ఎస్ టి ఎల్ ఎస్ ఆశాలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అక్కనపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులను అభినందించిన కల్వకుంట్ల కవిత

**నార్కట్ పల్లి వెలుతురు జూన్ 06:**



నార్కట్‌పల్లి మండలంలోని అక్కనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకుని పదో తరగతిలో మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కల్వకుంట్ల కవిత అభినందించారు. ఈ సందర్భంగా మండల ఫస్ట్ ర్యాంక్ సాధించిన పూజారి ప్రసన్న (544 మార్కులు), చిర్రబోయిన నర్మద (467 మార్కులు)లను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డా. టీజీ లింగం గౌడ్ చేసిన విజ్ఞప్తి మేరకు విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసం కోసం బీసీ గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (COE) కళాశాలలో అడ్మిషన్లు కల్పించాలని కోరగా, కల్వకుంట్ల కవిత వెంటనే స్పందించారు. సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి విద్యార్థులకు అడ్మిషన్లు ఏర్పాటు చేయించేందుకు చర్యలు తీసుకున్నారు. విద్యార్థుల భవిష్యత్ విద్యాభివృద్ధికి సహకరించిన కల్వకుంట్ల కవితకు నేస్తం బృందం కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో పవన్ కుమార్ యాదవ్, రాజేష్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములను కాపాడండి

**గ్రామ కంఠం, చెరువు శిఖం, కుంటల భూములను కాపాడండి**

**నీర్నెముల గ్రామ ప్రజలు**

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 06:**

మండల పరిధిలోని నీర్నెముల గ్రామంలో గ్రామ కంఠం భూములు కబ్జాకు గురవుతున్నాయని, ప్రభుత్వం స్పందించి గ్రామాల్లో సర్వే చేసి ఆ భూములను కాపాడాలని నీర్నెముల గ్రామ ప్రజలు అన్నారు. శుక్రవారం నీర్నెముల ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక గ్రామ సభ సందర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తాసీల్దార్ కు గ్రామ ప్రజలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు గ్రామంలో వున్న గ్రామ కంఠం, చెరువు శిఖం, కుంటల భూములను కొందరు అక్రమంగా ఆక్రమించి పంటలు పండించుకుంటున్నాను వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ భూములను సర్వే చేసి కాపాడాలని గ్రామ ప్రజలు కోరారు. మాజీ వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్, వార్డు సభ్యులు ముత్యాల కిషన్, చిన్న పాక రమేష్, బోయిని మల్లేష్, నోముల శివ, నోముల సుదర్శన్, నోముల రవి, నోముల నర్సింహా తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించిన బీసీ నాయకులు

**నల్లగొండ వెలుతురు జూన్ 06:**



బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, మునుగోడు ముద్దుబిడ్డ, సిపిఐ (CPI) నల్లగొండ జిల్లా కార్యదర్శి, శాసనమండలి సభ్యులు (MLC) శ్రీ నెల్లికంటి సత్యం గారి జన్మదిన వేడుకలను శనివారం రోజున నల్లగొండలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో బీసీ సంఘాల ముఖ్య నాయకులు అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బీసీ నాయకులు సత్యం గారికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కేక్ కట్ చేయించి వేడుకలు జరిపారు.ఈ సందర్భంగా బిసి యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగంటి విజయ్ గౌడ్, బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూడిద మల్లికార్జున్ యాదవ్, బిసి యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి అనగంటి కృష్ణ మాట్లాడుతూ పేద, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడే సత్యం అన్న ఆయురారోగ్యాలతో నూరేళ్లు వర్ధిల్లాలని ఆకాంక్షించారు. రాబోయే రోజుల్లో శాసనమండలి వేదికగా నల్లగొండ జిల్లా సమగ్ర అభివృద్ధికి, అలాగే బీసీల సంక్షేమానికి ఆయన మరింతగా కృషి చేయాలని, ఆయన నాయకత్వం వెనుకబడిన వర్గాలకు మరిన్ని విజయాలను అందించాలని వారు కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు గండిచెరువు వెంకన్న గౌడ్, గోసుకొండ మల్లేష్ ,జక్కలి శ్రీశైలం యాదవ్ ,కొంపల్లి కిరణ్ గౌడ్ ,గోపగోని అమరేందర్ ,గోపగోని దిలీప్ ,జనగాం శ్రీకాంత్ గౌడ్ ,ప్రజా సంఘాల ప్రతినిధులు, సిపిఐ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సత్యం శుభాకాంక్షలు వెల్లువలా కురిపించారు.

## జాతీయ లోక్ అదాలత్ విజయవంతం కోసం సమన్వయ సమావేశం నిర్వహణ

**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 06:**



సీనియర్ సివిల్ జడ్జి కోర్టు హాలులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహణకు సంబంధించి సమన్వయ సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశం సీనియర్ సివిల్ జడ్జి–కమ్–చైర్మన్ మండల న్యాయ సేవల కమిటీ జి. సబిత అధ్యక్షతన జరిగింది. రాబోయే 20 జూన్ 2026 న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయుటకు అవసరమైన చర్యలు, రాజీ ద్వారా పరిష్కరించదగిన కేసులను గుర్తించడం, సంబంధిత పక్షాలకు అవగాహన కల్పించడం, వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా ప్రజలు తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో తమ వివాదాలకు శాశ్వత పరిష్కారం పొందవచ్చని, సంబంధిత అధికారులు మరియు పోలీసు శాఖ సిబ్బంది పూర్తి సహకారం అందించాలని సీనియర్ సివిల్ జడ్జి జి. సబిత సూచించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్. శిరీష, అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి. రత్న కుమారి, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి డి. సత్తయ్య, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్. వెంకటేశ్వర్లు, రామన్నపేట సబ్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు మరియు అడ్డగూడూరు సబ్ ఇన్‌స్పెక్టర్ వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలే లక్ష్యంగా ఎమ్మెల్యే వేముల వీరేశం పర్యటన

**నార్కట్ పల్లి వెలుతురు జూన్ 06:**



నార్కెట్‌పల్లి పట్టణంలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ మరియు నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు ప్రాంతాలను సందర్శించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నార్కెట్‌పల్లి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జెరిపోతుల భారత్ కుమార్, పట్టణ ప్రజాప్రతినిధులు, , కాలనీ వాసులు పాల్గొన్నారు. పర్యటన సందర్భంగా ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి, పారిశుద్ధ్యం, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు తదితర మౌలిక సదుపాయాలపై స్థానికులు తమ సమస్యలను వివరించారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు.ఈ పర్యటనతో స్థానిక సమస్యల పరిష్కారానికి మరింత వేగం చేకూరుతుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేశారు.

# చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

**సర్వే నెం. 550 ప్రభుత్వ భూమిపై ఆక్రమణలు సహించం**

**నార్కెట్‌పల్లి, వెలుతురు జూన్ 06:** నార్కెట్‌పల్లి మండల పరిధిలోని సర్వే నెం. 550 ప్రభుత్వ భూమిపై ఎలాంటి అక్రమ ఆక్రమణలు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులు హెచ్చరించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించడం తమ బాధ్యత అని పేర్కొంటూ, ఆక్రమణలపై ఫిర్యాదులు అందిన నేపథ్యంలో అధికారులు స్థలాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా భూమి రికార్డులు, హద్దులు మరియు ప్రస్తుత పరిస్థితిని పరిశీలించిన అధికారులు ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రజలు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించకుండా సహకరించాలని కోరారు.స్థల పరిశీలనలో రెవెన్యూ అధికారులు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వ ఆస్తుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

శీర్షికలు:
**సర్వే నెం. 550 ప్రభుత్వ భూమిపై ఆక్రమణలు అరికడతాం**
**ప్రభుత్వ భూములను కాపాడటం అందరి బాధ్యత**
**ఆక్రమణదారులపై కఠిన చర్యలు: అధికారులు హెచ్చరిక**

# అనాజిపురంలో దొంగల స్వైర్య విహారం

**మోత్కూర్, జూన్ 6, (వెలుతురు న్యూస్ ):**





మోత్కూర్ మండల పరిధిలోని అనాజిపురం గ్రామంలో దొంగతనం జరిగిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. తాళం వేసి ఊరు వెళ్లిన ఇంటిని లక్ష్యంగా చేసుకొని దొంగలు చోరీకి పాల్పడ్డారు. బాధితురాలు కొల్లు నరసమ్మ తెలిపిన వివరాల ప్రకారం, ఆమె ఈనెల 2న మంగళవారం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లో ఉన్న తన కుమారుడు కొల్లు నర్సింగ్ వద్దకు వెళ్లింది. శనివారం ఉదయం గ్రామానికి తిరిగి చేరుకుని ఇంటి వద్దకు రాగా మెయిన్ డోర్ తీసి ఉండడంతో అనుమానం వచ్చి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళాలు కూడా తెరిచి ఉన్నాయి. చోరీ జరిగిందని గ్రహించి, వెంటనే ఆమె గ్రామస్తులకు సమాచారం ఇచ్చింది. గ్రామస్తుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఇంటిని పరిశీలించారు.శుక్రవారం రాత్రి చోరీ జరిగి ఉండవచ్చని ప్రాథమిక అంచనా కు వచ్చారు. ఈ చోరీ ఘటనలో బీరువాలు దాచి ఉంచిన 12 తులాల వెండి, సుమారు రూ.30 వేల నగదును ఎత్తుకెళ్లినట్లు బాధితురాలు కొల్లు నర్సమ్మ తెలిపింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టినట్లు ఎస్ఐ సతీష్‌కుమార్ విలేకరులకు తెలిపారు.

## నేపాలి దోపిడీ ముఠా అరెస్ట్



**బేగంపేట్ జూన్ 6, (వెలుతురు న్యూస్ ):**

నమ్మకంగా ఇంట్లో పనిలో చేరి ఆపై యజమానులకే మత్తుమందు ఇచ్చి కాళ్లు, చేతులు కట్టేసి ఘరానా దోపిడీకి పాల్పడిన అంతర్రాష్ట్ర నేపాలీ ముఠాను మల్కాజిగిరి కమిషనరేట్ పోలీసులు అరెస్టు చేశారు. పరారీలో ఉన్న నిందితుల కోసం దేశవ్యాప్తంగా గాలించి పట్టుకున్నట్టు పోలీస్ కమిషనర్ బి.సుమతి తెలిపారు. శనివారం మల్కాజిగిరి డీసీపీ కార్యాల యంలో ఆమె వివరాలు వెల్లడించారు. హైదరాబాద్ జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కౌకూర్, మోహన్స్ గోల్ఫ్ ఎన్‌క్లేవ్‌లో నివసిస్తున్న అంతర్జాతీయ ఆర్బిట్రేటర్ మురళీ మోహన్ నర్సి పురం(68) ఇంట్లో వృద్ధ దంపతులు ఉంటున్నారు. దంపతులు మాత్రమే ఉంటున్నారని గమనించిన నేపాలీ కార్మికులు మీనా, రాజేష్ దోపిడీకి పథకం రచించారు. ఇందుకోసం మరో ఆరుగురు నేపాలీయులతో కలిసి ముఠాగా ఏర్పడి ఏప్రిల్ 25న సబీనా అనే మహిళను ఆ ఇంట్లో పనిమనిషిగా చేర్పించారు.

# సంగారెడ్డిలో వ్యవసాయ జీవవైవిధ్య పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ

- **UNDP-BIOFIN మద్దతుతో "ఎన్‌హాన్స్డ్ అగ్రోబయోడైవర్సిటీ" ప్రాజెక్ట్ ప్రారంభం**
- **సిరిధాన్యాల ప్రోత్సాహం, రైతుల ఆదాయ వృద్ధి, సహజ వనరుల సంరక్షణే లక్ష్యం**
- **జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**జహీరాబాద్ వెలుతురు జూన్ 06:**

సంగారెడ్డి జిల్లాలో వ్యవసాయ జీవవైవిధ్య పరిరక్షణ, సిరిధాన్యాల సాగు ప్రోత్సాహం, సహజ వనరుల సుస్థిర వినియోగం మరియు రైతుల జీవనోపాధి మెరుగుదలకు ఉద్దేశించిన "Enhanced Agrobio-diversity in Sangareddy District" ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టారు.

ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం (UNDP)కు చెందిన BIOFIN మద్దతుతో డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (DDS), DDS కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా నిర్వహించిన ప్రారంభ కార్యశాల శనివారం జహీరాబాద్‌లో జరిగింది. జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ ప్రతీక్ జైన్, ఐఏఎస్ ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా సంగం మహిళలు, రైతులు తమ అనుభవాలు, వ్యవసాయ రంగంలో ఎదుర్కొంటున్న సమస్యలు, సిరిధాన్యాల సాగులోని సవాళ్లను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. రైతుల సమస్యలను ఓర్పుగా ఆలకించిన కలెక్టర్, సంబంధిత శాఖలతో సమన్వయం చేసి సాధ్యమైనంత త్వరగా పరిష్కార మార్గాలు అన్వేషిస్తామని హామీ ఇచ్చారు.

సంగారెడ్డి జిల్లాలో సిరిధాన్యాల సాగు విస్తీర్ణం, ఉత్పత్తి, మార్కెటింగ్ అవకాశాలపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్న కలెక్టర్, భవిష్యత్తులో మిల్లెట్ రైతులకు మరింత ప్రోత్సాహం అందించే చర్యలు అవసరమని అభిప్రాయపడ్డారు. గ్రామీణ మహిళలు ముందుకు వచ్చి సిరిధాన్యాలు, వాటి విలువ ఆధారిత ఉత్పత్తుల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తే జిల్లా యంత్రాంగం తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. మహిళలు తయారు చేసే ఉత్పత్తులను కొనుగోలు చేసి ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

కార్యక్రమం అనంతరం కలెక్టర్ DDS-KVK ప్రదర్శన స్టాల్‌ను సందర్శించారు. అక్కడ ప్రదర్శించిన సిరిధాన్యాల ఉత్పత్తులు, సహజ వ్యవసాయ పద్ధతులు, జీవవైవిధ్య పరిరక్షణ చర్యలు, రైతులకు అందిస్తున్న సాంకేతిక సేవలపై శాస్త్రవేత్తలతో చర్చించారు. వ్యవసాయ రంగంలో సంగం మహిళలు చేస్తున్న కృషిని ప్రత్యేకంగా అభినందించారు.



ఈ సందర్భంగా డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం. జ్యోతి మాట్లాడుతూ, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్‌ఆర్‌ఈజీఎస్) ద్వారా వ్యవసాయ చెరువుల నిర్మాణం, భూసంరక్షణ పనులు, సహజ వనరుల అభివృద్ధి కార్యక్రమాలకు విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు రైతులకు అందుబాటులో ఉన్న వివిధ ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఆయిల్ పామ్ సాగు విస్తరణ, అజోల్లా యూనిట్ల స్థాపన, పండ్ల తోటల అభివృద్ధి, నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే ఆధునిక పద్ధతులు, ఉద్యానవన శాఖ సబ్సిడీ పథకాలను వినియోగించుకోవాలని రైతులకు సూచించారు.

డీడీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. దివ్య వెలుగూరి, డీడీఎస్-కేవీకే సీనియర్ సైంటిస్ట్ అండ్ హెడ్ డా. సి. వర ప్రసాద్, డా. వల్లి మణిక్యం తదితరులు ప్రాజెక్ట్ లక్ష్యాలు, వ్యవసాయ జీవవైవిధ్య పరిరక్షణ అవసరం, రైతుల భాగస్వామ్యం, సిరిధాన్యాల ప్రాముఖ్యతపై సవివరంగా వివరించారు.

వ్యవసాయ రంగంలో పర్యావరణ అనుకూల విధానాలను ప్రోత్సహిస్తూ, జీవవైవిధ్య పరిరక్షణతో పాటు రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా ఈ ప్రాజెక్ట్ కీలక పాత్ర పోషిస్తుందని వక్తలు అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు, అభివృద్ధి భాగస్వామ్య సంస్థల సభ్యులు, డీడీఎస్ సంగం మహిళలు, రైతులు, శాస్త్రవేత్తలు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విశ్వాసం, అభివృద్ధి, ప్రజా సంక్షేమం' లక్ష్యం గా మోదీ ప్రభుత్వ 12 ఏళ్ల పాలన

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆంటోనీ రెడ్డి**

**కరీంనగర్ వెలుతురు జూన్ 06:**

విశ్వాసం, అభివృద్ధి, ప్రజా సంక్షేమం' లక్ష్యం గా మోదీ ప్రభుత్వ 12 ఏళ్ల పాలన కొనసాగిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆంటోనీ రెడ్డి అన్నారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని బీజేపీ శ్రేణులు చేపట్టాల్సిన ప్రత్యేక సేవా, ప్రజాహిత కార్యక్రమాల కోసం శనివారం రోజున తిమ్మాపూర్ బిజెపి మండల అధ్యక్షులు చింతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో మహాత్మా నగర్ లోని శ్రీ తపాల లక్ష్మీనరసింహస్వామి దేవాలయ కళ్యాణమండపంలో మండల బిజెపి ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ విజయాలు , 12 ఏళ్ల ప్రగతినీ వివరించారు , పార్టీ నిర్ణయించిన ప్రచార కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలన్నారు.

గడిచిన 12 ఏళ్లలో అవినీతి రహిత పాలన, ఆర్థిక వ్యవస్థ బలోపేతం, ఆయుష్మాన్ భారత్, ఉచిత బియ్యం పంపిణీ తో పాటు అనేక సంక్షేమ పథకాలు, చారిత్రక , సాహసోపేత బిల్లులు , అన్ని రంగాలలో దేశం సాధించిన ప్రగతిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు వెళ్లడానికి ప్రయత్నం చేయాలన్నారు.

**పర్యావరణాన్ని పరిరక్షించాలి... చింతం శ్రీనివాస్.**





పర్యావరణ పరిరక్షణతోనే మానవాళికి భవిష్యత్తు ఉంటుందని, పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తిమ్మాపూర్ బిజెపి మండల అధ్యక్షులు చింతం శ్రీనివాస్ అన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం విజయవంతంగా 12 సంవత్సరాల పాలనను పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని అమ్మ పేరుతో ఓ మొక్కను నాటే కార్యక్రమం తిమ్మాపూర్ మండలంలోని అన్ని పోలింగ్ బూత్ కేంద్రాల్లో చేపట్టారు.

మహాత్మా నగర్ గ్రామపంచాయతీ పరిధిలో స్థానిక బిజెపి శ్రేణులు చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమంలో చింతం శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తుందన్నారు. గడిచిన 12 ఏళ్ల కాలంలో మోడీ ప్రభుత్వం కేవలం ఆర్థిక, సాంకేతిక రంగాలకే కాకుండా పర్యావరణ రక్షణకు కూడా సమాన ప్రాధాన్యతనిచ్చిందన్నారు.

పర్యావరణ దినోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా భారీ ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాలకు బిజెపి శ్రీకారం చుట్టిందని, ఆ దిశలోనే'ఏక్ పేడ్ మా కే నామ్' (అమ్మ పేరిట ఒక మొక్క) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

పర్యావరణాన్ని కాపాడడానికి చేపడుతున్న ఈ మహత్తర కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు ప్రతి ఒక్కరూ తమ తల్లి జ్ఞాపకార్థం , గౌరవార్థం ఒక మొక్కను నాటాలని ఆయన కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర, మండలాధ్యక్షుడు చింతం శ్రీనివాస్, , జిల్లా కార్యవర్గ సభ్యులు బూట్ల శ్రీనివాస్ , గొట్టిముక్కల తిరుపతి రెడ్డి, బోనాల మోహన్,కోయ్యడ శ్రీనివాసు,ఎర్రోజు లక్ష్మణ్,తమ్మనవేని రాజుయదవ్, బిజెవైయం మండల అధ్యక్షుడు గడ్డం అరుణ్ ,కానుగంటి మదుకర్ రెడ్డి,బుర్ర శ్రీనివాసు,గడ్డం శ్రీనివాస్ రెడ్డి,రామిడి మహేందర్ రడ్డి,కన్నం సాయి, ఆంజనేయులు, జక్కోజు అనిల్,ఉప్పులేటి జీవన్,ప్రదీప్ రెడ్డి,వేల్పుల ఓదెలు,ఈశ్వర చారి, మల్లేశం,మదుసూదన్ రెడ్డి, వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు, బిఎల్ఎ2 ఇన్చార్జులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- **హుగ్గెల్లిలో ఘనంగా ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ గ్రామ సభ**
- **ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యం**
- **సర్పంచ్ పట్లోళ్ళ విమల శ్రీనివాస్ రెడ్డి**

**జహీరాబాద్ వెలుతురు జూన్ 06:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని హుగ్గెల్లి గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా గ్రామ సభను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పట్లోళ్ళ విమల శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభకు ఎంపీడీవో మహేందర్ రెడ్డి, డీఎస్పీ సైదా, ఎస్ఐ కాశీనాథ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజల సమస్యలను గ్రామ స్థాయిలోనే గుర్తించి వేగంగా పరిష్కరించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై పూర్తి అవగాహన కల్పించేందుకు గ్రామ సభలు ఉత్తమ వేదికలుగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని సూచించారు.

గ్రామాల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని పేర్కొంటూ, విద్య, వైద్యం, పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి కుటుంబం తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి గ్రామ పంచాయతీకి అందించాలని, సాలిడ్ అండ్ లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ విధానాలను సమర్థవంతంగా అమలు



చేయాలని వివరించారు.

వ్యవసాయ రంగానికి సంబంధించిన అంశాలపై కూడా రైతులకు అవగాహన కల్పించారు. పంట మార్పిడి విధానాలను పాటించడం ద్వారా భూసారాన్ని కాపాడుకోవచ్చని, వ్యవసాయ శాఖ సూచించే శాస్త్రీయ సాగు పద్ధతులను అనుసరించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ప్రభుత్వ వ్యవసాయ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యారంగంపై ప్రత్యేకంగా మాట్లాడిన అధికారులు, ప్రభుత్వం అమలు చేస్తున్న బడిబాట కార్యక్రమంను విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, డిజిటల్ తరగతులు, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. డీఎస్పీ సైదా మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మహిళల భద్రత కోసం పోలీసు శాఖ ఏర్పాటు చేసిన షీ టీమ్స్ సేవలను అవసరమైన సందర్భాల్లో వినియోగించుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు.

గ్రామాభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని, గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని వక్తలు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# "మన గల్లీ – మన బాధ్యత".. 27వ వార్డులో స్వచ్ఛతకు శ్రీకారం

- **పరిశుభ్రమైన వార్డు నిర్మాణానికి ప్రజలందరూ భాగస్వాములు కావాలి...**
- **27వ వార్డు కౌన్సిలర్ నామ స్రవంతి రవి కిరణ్**

**జహీరాబాద్ వెలుతురు జూన్ 06:**

పరిసరాల పరిశుభ్రత ప్రతి పౌరుడి బాధ్యత అనే సందేశంతో సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపాలిటీ 27వ వార్డులో ప్రత్యేక స్వచ్ఛత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. "మన గల్లీ – మన బాధ్యత" అనే నినాదంతో కౌన్సిలర్ నామ స్రవంతి రవి కిరణ్ ఆధ్వర్యంలో సుభాష్ గంజ్ ప్రాంతంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.

ఈ సందర్భంగా కౌన్సిలర్ నామ స్రవంతి రవి కిరణ్ మాట్లాడుతూ, ప్రతి కుటుంబం తమ ఇంటిని ఎలా శుభ్రంగా ఉంచుకుంటుందో, అదే విధంగా గల్లీలు, కాలనీలు మరియు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వార్డును పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు.

స్థానిక మహిళలతో కలిసి వార్డులోని పలు ప్రాంతాల్లో పర్యటించిన ఆమె, ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. ఇంటి చెత్తను రోడ్లపై, ఖాళీ స్థలాల్లో లేదా డ్రైనేజీల్లో వేయకుండా మున్సిపాలిటీ నిర్వహిస్తున్న చెత్త సేకరణ వాహనాల్లోనే వేయాలని సూచించారు. చెత్తను సరైన పద్ధతిలో నిర్వహించడం ద్వారా వ్యాధుల వ్యాప్తిని



అరికట్టడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవచ్చని వివరించారు.

పరిశుభ్రమైన వాతావరణం ప్రజల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, స్వచ్ఛమైన వార్డు నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ 27వ వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక మహిళలు కౌన్సిలర్ చేపట్టిన స్వచ్ఛత కార్యక్రమానికి మద్దతు ప్రకటించారు. చెత్తను నిర్ణీత మున్సిపల్ వాహనాల్లోనే వేస్తామని, తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో పారిశుధ్యంపై మరింత చైతన్యం పెరిగిందని వారు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో జవాన్ శ్రీధర్, రిసోర్స్ పర్సన్ లక్ష్మి, స్వయం సహాయక సంఘాల సభ్యులు, మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది, స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

**బిజెపి కార్పొరేటర్లు తోట అనిల్, కే . పి.చంద్ర , తుల శ్రీనివాస్ పిలుపు**

**కరీంనగర్ వెలుతురు జూన్ 06:**

పర్యావరణాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని బిజెపి కార్పొరేటర్లు తోట అనిల్, కే . పి.చంద్ర , తుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ పిలుపుమేరకు మా కే నామ్ ఏక్ పేడ్ (అమ్మ పేరుతో ఒక చెట్టు నాటడం ) ప్రోగ్రాం ను శనివారం రోజున ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్లోని సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారు మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టడానికి, గ్లోబల్ వార్మింగ్ సవాళ్లను ఎదుర్కోవడానికి వృక్షోత్పత్తి ఒక్కటే మార్గమన్నారు. డివిజన్‌లోనూ పచ్చదనాన్ని పెంపొందించేందుకు బిజెపి శ్రేణుల ఆధ్వర్యంలో నిరంతరం శ్రమిస్తాయని, రాబోయే రోజుల్లో మరిన్ని పర్యావరణ కార్యక్రమాలను చేపడతామని వెల్లడించారు."మొక్కలు నాటడం అనేది ఒక రోజు కార్యక్రమం కాదు, అది ఒక నిరంతర ప్రక్రియ.

నాటిన ప్రతి మొక్కను వృక్షంగా మార్చే వరకు కాలనీ కమిటీలు, ప్రజలు బాధ్యత తీసుకోవాలనీ కోరారు. రాబోయి వర్షాకాలంలో రోడ్లకు ఇరువైపులా, ఖాళీ స్థలాలలో వివిధ రకాల నీడను ఇచ్చే, పూల మొక్కలను నాటాలని వారు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.



## వైసీపీ నేతలతో లింకులేంటి?

- మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును ప్రశ్నించిన పోలీసులు
- భూవివాద కేసులో బొల్ల బ్రహ్మనాయుడు అరెస్ట్
- సైబరాబాద్ పోలీసులు పలు కోణాల్లో లోతైన ప్రశ్నలు
- కాంచీపురంలో అరెస్ట్ చేసి హైదరాబాద్‌కు తరలింపు
- ట్రాన్సిట్ వారెంట్‌పై ఉప్పర్‌పల్లి కోర్టులో హాజరు
- గండిపేట భూమి వ్యవహారంలో కీలక ఆరోపణలు
- వెల్ది రాధాకృష్ణ, నిమ్మల దశరథ కుటుంబాలతో లావాదేవీలపై ఆరా
- కడప వైసీపీ నేతలతో ఆర్థిక లింకులపై విచారణ
- వాంగ్మూలం నమోదు చేసిన పోలీసులు
- 9.28 ఎకరాల భూమి కబ్జా యత్నం కేసు
- రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతున్న భూవివాదం

**సైబరాబాద్ వెలుతురు జూన్ 06:**



వైకాపా మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును సైబరాబాద్ పోలీసులు వివిధ కోణాల్లో ప్రశ్నించారు. భూవివాదానికి సంబంధించిన కేసులో ఆయనపై నమోదైన ఆరోపణల నేపథ్యంలో పోలీసులు విచారణను మరింత విస్తరించారు.

పోలీసుల సమాచారం ప్రకారం, నిన్న కాంచీపురంలో ఆయనను అరెస్ట్ చేసిన అధికారులు అక్కడి కోర్టులో హాజరుపరిచి, ట్రాన్సిట్ వారెంట్‌పై హైదరాబాద్‌కు తరలించారు. అనంతరం సైబరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఆయనను పలు గంటల పాటు విచారించారు. విచారణలో భాగంగా వెల్ది రాధాకృష్ణ, నిమ్మల దశరథ కుటుంబాలతో జరిగిన ఆర్థిక లావాదేవీలపై పోలీసులు ప్రశ్నించినట్లు తెలిసింది. అలాగే కడప జిల్లాకు చెందిన వైకాపా నేతలతో ఉన్న సంబంధాలు, భూవ్యవహారాల్లో జరిగిన లావాదేవీలపై కూడా ఆరా తీశారు.

పోలీసులు నమోదు చేసిన వివరాల ప్రకారం, గండిపేట పరిధిలోని సర్వే నంబర్ 18లో ఉన్న 9.28 ఎకరాల భూమిని కబ్జా చేసేందుకు ఒక గ్యాంగ్ ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో బొల్లా బ్రహ్మనాయుడు పాత్రపై కూడా విచారణ కొనసాగుతోంది. అంతేకాకుండా భూమి సంబంధిత డాక్యుమెంట్లు, ఒప్పందాలు, మధ్యవర్తుల పాత్రపై పోలీసులు లోతుగా పరిశీలిస్తున్నారు. ఈ కేసులో ఇప్పటికే కొన్ని ఆధారాలను సేకరించినట్లు సమాచారం.

విచారణ అనంతరం ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేసిన పోలీసులు, తదుపరి చట్టపరమైన ప్రక్రియను కొనసాగిస్తున్నారు. మధ్యాహ్నం తర్వాత ఆయనను ఉప్పర్‌పల్లి కోర్టులో హాజరుపర్చనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కేసు వెలుగులోకి రావడంతో రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. భూవివాదాలు, ఆర్థిక లావాదేవీలు, రాజకీయ సంబంధాలపై పోలీసులు దృష్టి సారించడంతో కేసు మరింత విస్తరించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

## పోచంపల్లి చేనేత కళ కు ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంది



**భారీ నీటి పారుదల, సివిల్ సప్లై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**రంగారెడ్డి జిల్లా వెలుతురు జూన్ 06:**

శనివారం హైటెక్స్ లో ఏర్పాటు చేసిన థ్రెడ్ పోచంపల్లి చేనేత ఎగ్జిబిషన్ కు మంత్రి విచ్చేసి ఎగ్జిబిషన్ లో ఏర్పాటు చేసిన చేనేత స్టాల్స్ ను మంత్రి సందర్శించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పోచంపల్లి చేనేత కళా వైభవాన్ని ప్రపంచానికి మరింత చేరువ చేసే లక్ష్యంతో హైదరాబాద్లోని హైటెక్స్లో జూన్ 7 వరకు నిర్వహిస్తున్నారని మంత్రి అన్నారు. చేనేత కార్మికుల అపూర్వ నైపుణ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు వారికి మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాదాపూర్ హైటెక్స్ లో "పోచంపల్లి Thread " ఎగ్జిబిషన్ కార్యక్రమానికి తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హాల్ లోని స్టాల్స్ అన్నింటిని ఆయన సందర్శిచి , వర్తకులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ " పోచంపల్లి వస్త్రాలకు ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతి ఉందన్నారు. తాను ఎంపీగా ఉన్న కాలంలో పోచంపల్లి శాలువలను ఢిల్లీలో సహచర ఎంపీలు , కేంద్ర మంత్రులకు కప్పి భూదాన్ పోచంపల్లి వస్త్రాల గొప్పతనాన్ని వివరించే వాడినని ఆయన తెలిపారు.

చేనేత కార్మికుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశానని ఈ సందర్భంగా వివరించారు. చేనేత వస్త్రాలను ధరించి , మన సాంస్కృతి , సంప్రదాయన్నీ కాపాడుకోవాలని ఆయన తెలిపారు. హైటెక్స్ లో జరిగే వస్త్ర ప్రదర్శన కార్యక్రమాన్ని సందర్శించి, నాణ్యత కలిగిన వస్త్రాలను కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జగన్నాథం, జిల్లా చేనేత అధికారి శ్రీనివాస్, లో సంబధిత అధికారులు పాల్గొన్నారు.

# గచ్చిబౌలిలో ఘనంగా ముగిసిన యోనెక్స్

## సన్‌రైజ్ సబ్ జూనియర్ ర్యాంకింగ్ టోర్నీ

**హైదరాబాద్, వెలుతురు జూన్ 6:**

గచ్చిబౌలిలోని పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ వేదికగా మే 29 నుంచి నిర్వహించిన యోనెక్స్–సన్‌రైజ్ ఆల్ ఇండియా సబ్ జూనియర్ (అండర్–15, అండర్–17) ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ శనివారం ఘనంగా ముగిసింది. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాల నుంచి 3,600 మందికి పైగా యువ షట్లర్లు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. వారం రోజుల పాటు ఉత్కంఠభరితంగా సాగిన పోటీల్లో భవిష్యత్ స్టార్ షట్లర్లు తమ నైపుణ్యాన్ని చాటుకుంటూ ప్రేక్షకులను అలరించారు.

అండర్–15 బాలుర సింగిల్స్‌లో ఉత్తరాఖండ్‌కు చెందిన ఆదిత్య సింగ్ నేగి ఛాంపియన్‌గా నిలవగా, బాలికల సింగిల్స్‌లో రాజస్థాన్‌కు చెందిన అన్వి రాథోర్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. తెలంగాణకు చెందిన హంసిని రన్నరప్‌గా నిలిచి ప్రశంసలు అందుకుంది. అండర్–17 బాలికల సింగిల్స్ విభాగంలో అవని విజేతగా నిలిచింది. బాలుర డబుల్స్‌లో తమిళనాడుకు చెందిన తాబిన్ అనుఫ్ అహ్మద్ ఎం.ఎఫ్ – తెలంగాణకు చెందిన శ్రీచేతన్ శౌర్య శామల జోడీ అద్భుత ఆటతీరుతో విజేతలుగా నిలిచింది.

బాలికల డబుల్స్‌లో కేరళకు చెందిన అలెక్సియా ఎల్సా అలెగ్జాండర్ – తమిళనాడుకు చెందిన జయ సప్తశ్రీ ఎం జోడీ టైటిల్‌ను సొంతం చేసుకుంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో మిజోరంకు చెందిన







లియాన్‌సాంగ్పుయా – నాగాలాండ్‌కు చెందిన కిమ్‌కిమ్ ఖోంగ్‌సై జోడీ ఛాంపియన్‌గా అవతరించింది.

ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి, తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు దుద్దిళ్ల శ్రీధర్ బాబు విజేతలకు బహుమతులు అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత బ్యాడ్మింటన్ అభివృద్ధిలో జాతీయ ప్రధాన కోచ్ డా. పుల్లెల గోపీచంద్ పాత్ర అపూర్వమని కొనియాడారు. గ్రామీణ స్థాయి నుంచి ప్రపంచ వేదిక వరకు ప్రతిభావంతులైన క్రీడాకారులను తీర్చిదిద్దడంలో ఆయన చేస్తున్న కృషి దేశ క్రీడారంగానికి అమూల్యమైనదని పేర్కొన్నారు. ప్రపంచస్థాయి షట్లర్లను తయారు చేసి భారత ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టిన గోపీచంద్ సేవలు చిరస్మరణీయమని అన్నారు.

బ్యాట్ ఉపాధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ టోర్నీలో పాల్గొన్న యువ క్రీడాకారుల ప్రతిభను అభినందించారు.

దేశం నలుమూలల నుంచి వచ్చిన షట్లర్లు అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించారని కొనియాడారు. క్రమశిక్షణ, అంకితభావం, నిరంతర సాధనతో ముందుకు సాగితే భవిష్యత్తులో భారతదేశానికి అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు అందించే క్రీడాకారులుగా ఎదుగుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

విజేతలు, రన్నరప్ క్రీడాకారులను అభినందించిన వి చాముండేశ్వరి నాథ్ యువ క్రీడాకారుల విజయాల్లో కోచ్‌లు, తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. కఠోర సాధనతో ముందుకు సాగుతున్న యువ షట్లర్లు భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ యు.వి.ఎన్. బాబు, బాయ్ కన్వీనర్ ఉమర్ రషీద్, బ్యాట్ ఉపాధ్యక్షులు వి. చాముండేశ్వరి నాథ్, బ్యాట్ సలహాదారు కొసరాజు లక్ష్మణ్, కోశాధికారి కె. వంశీధర్, బ్యాట్ సభ్యులు శ్రీనివాసరావు, మీడియా కోఆర్డినేటర్ రమణా రెడ్డి, స్పాన్సర్ రాజిరెడ్డి, గ్లోబల్ సొల్యూషన్స్ ప్రతినిధి స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

# పంజాబ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- అస్థికలు కలపడానికి వెళ్తుండగా 8 మంది మృతి
- అస్థికలు కలపడానికి బయలుదేరిన కుటుంబం ప్రయాణంలో విషాదం
- ఫిరోజ్‌పూర్–ఫాజిల్కా రహదారిపై రెండు ట్రక్కుల ఎదురెదురు ఢీ
- మహీంద్రా పికప్‌లో ప్రయాణిస్తున్న 25 మంది పై ప్రభావం
- నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిన ఘటన
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరో నలుగురు మృతి
- జలాలాబాద్ ప్రాంత వాసులుగా మృతుల గుర్తింపు
- జంగవాలా గ్రామం వద్ద జరిగిన ఘోర ప్రమాదం
- గాయపడిన 15 మందికి ఆస్పత్రిలో అత్యవసర చికిత్స
- కొంతమంది పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం

**పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభం**

**పంజాబ్ వెలుతురు జూన్ 06:**

పంజాబ్ రాష్ట్రంలో ఫిరోజ్‌పూర్–ఫాజిల్కా ప్రధాన రహదారిపై శనివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. రెండు ట్రక్కులు ఎదురెదురుగా వేగంగా ఢీకొనడంతో జరిగిన ఈ ప్రమాదంలో మొత్తం 8 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఒక సాధారణ రోడ్డు ప్రమాదం మాత్రమే కాకుండా, ఒక కుటుంబం తమ బంధువు అస్థికలను నిమజ్జనం చేయడానికి వెళ్లిన ప్రయాణంలోనే చోటుచేసుకోవడంతో మరింత హృదయ విదారకంగా మారింది.

పోలీసుల వివరాల ప్రకారం, జలాలాబాద్ ప్రాంతానికి చెందిన ఒక కుటుంబం ఇటీవల మరణించిన తమ బంధువు అస్థికలను పంజాబ్‌లోని బియాస్ ప్రాంతంలో ఉన్న రాధా సోమీ డేరాలో నీటిలో కలపడానికి బయలుదేరింది. ఈ పవిత్ర కార్యక్రమం కోసం సుమారు 25 మంది ఒకే మహీంద్రా పికప్ వాహనంలో ప్రయాణం ప్రారంభించారు. ఉదయం వేళలో ప్రయాణం ప్రారంభించిన ఈ బృందం, కుటుంబ సభ్యులంతా కలిసి ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని పూర్తి చేయాలనే ఉద్దేశంతో ముందుకు సాగారు.

అయితే వారి ప్రయాణం జంగవాలా గ్రామం సమీపానికి చేరుకున్న క్రమంలో ఒక్కసారిగా విషాదంగా మారింది. ఎదురుగా వేగంగా వస్తున్న మరో ట్రక్కు నియంత్రణ కోల్పోయి పికప్ వాహనాన్ని ఢీకొట్టింది. అదే సమయంలో రెండు భారీ వాహనాల మధ్య తీవ్ర ఢీకొనడం వల్ల వాహనాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ ఘోర ప్రమాదంలో నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.

ప్రమాద తీవ్రత ఎంతగా ఉందంటే, పికప్ వాహనం పూర్తిగా నలిగిపోయిన స్థితిలో మారిపోయింది. అందులో ప్రయాణిస్తున్న వారిలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, వైద్య సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని గాయపడిన వారిని బయటకు తీసి అత్యవసర చికిత్స కోసం సమీప ఆస్పత్రికి తరలించారు.

ఆస్పత్రికి తరలించిన వారిలో పరిస్థితి విషమంగా ఉన్నవారు ఉన్నట్లు వైద్యులు తెలిపారు. చికిత్స పొందుతూ మరో నలుగురు ప్రాణాలు కోల్పోవడంతో మృతుల సంఖ్య 8కి పెరిగింది. ఇంకా కొందరి పరిస్థితి అత్యంత సీరియస్‌గా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు సూచించారు.

మృతులంతా ఒకే ప్రాంతానికి చెందిన వారిగా, జలాలాబాద్ వాసులుగా పోలీసులు గుర్తించారు. ఒకే కుటుంబానికి చెందిన బంధువులు, స్నేహితులు కలిసి ప్రయాణించడంతో ఈ ఘటన మరింత విషాదకరంగా మారింది. ఒక వైపు తమ బంధువు అస్థికలను నిమజ్జనం చేయడానికి వెళ్తున్న సందర్భంలోనే మరణం వారిని వెంటాడడం స్థానికులను తీవ్రంగా కలచివేసింది.

ప్రమాదం జరిగిన వెంటనే జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రెండు భారీ ట్రక్కులు, ఒక పికప్ వాహనం రోడ్డుపై అడ్డంగా పడిపోవడంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. పోలీసులు వెంటనే ట్రాఫిక్‌ను మళ్లించి పరిస్థితిని నియంత్రణలోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. క్రేన్‌ల సహాయంతో వాహనాలను తొలగించే పనులు చేపట్టారు.

గాయపడిన వారిని ఫిరోజ్‌పూర్ సివిల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ అత్యవసర వార్డుల్లో చికిత్స కొనసాగుతోంది. వైద్య బృందాలు గాయాల తీవ్రతను బట్టి ప్రాధాన్యతా చికిత్స అందిస్తున్నాయి. కొందరికి తల, ఛాతీ, కాళ్లకు తీవ్రమైన గాయాలు అయినట్లు



సమాచారం. దీంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది.

ఈ ఘటనతో ఆస్పత్రి ప్రాంగణం కూడా విషాద వాతావరణంలో మునిగిపోయింది. ఒకవైపు రక్తసంబంధీకుల మృతదేహాలు, మరోవైపు తీవ్రంగా గాయపడిన కుటుంబ సభ్యుల బాధతో బంధువుల రోదనలు మిన్నంటాయి. "మా వాళ్లు ఒక్క క్షణంలోనే మమ్మల్ని వదిలి వెళ్లిపోయారు" అంటూ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి కారణమైన ట్రక్కు వేగం, డ్రైవర్ నిర్లక్ష్యం, రోడ్ కండిషన్ వంటి అంశాలను పరిశీలిస్తున్నారు. రెండు భారీ వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడానికి గల అసలు కారణాన్ని తెలుసుకునేందుకు సీసీటీవీ ఫుటేజ్, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలను సేకరిస్తున్నారు. రోడ్డు భద్రత నిపుణులు ఈ ఘటనను మరోసారి భారీ వాహనాల వేగ నియంత్రణ అవసరాన్ని గుర్తు చేసే ప్రమాదంగా పేర్కొంటున్నారు. ముఖ్యంగా హైవేలపై భారీ వాహనాల డ్రైవింగ్‌లో అలసట, వేగం, లేన్ డిసిప్లిన్ లేకపోవడం ఇలాంటి ఘోర ఘటనలకు దారితీస్తున్నాయని చెబుతున్నారు. ఈ ప్రమాదం ఒక కుటుంబానికి తీరని శోకాన్ని మిగిల్చింది. ఒక పవిత్ర కార్యక్రమానికి బయలుదేరిన వారు ఇలా మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పోవడం స్థానికంగా తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. గ్రామాల్లో కూడా ఈ వార్త తెలిసిన వెంటనే విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రస్తుతం గాయపడినవారికి మెరుగైన చికిత్స అందించేందుకు అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చిన తర్వాత మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# రాజ్యసభ అభ్యర్థిగా లింగమనేని రమేష్ నామినేషన్

- జనసేన తరఫున నామినేషన్ దాఖలు
- కూటమి ఐక్యతకు సంకేతంగా బలమైన మద్దతు
- టీడీపీ, జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలు సంతకాలతో ప్రతిపాదన దాఖలు
- అసెంబ్లీ పరిధిలో నామినేషన్ ప్రక్రియ పూర్తి
- రాజ్యసభ ఎన్నికల్లో కూటమి వ్యూహాత్మక అడుగు
- విధాన సభలో హాజరైన ప్రముఖ ఎమ్మెల్యేలు

**అమరావతి వెలుతురు జూన్ 06:**

రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో జనసేన పార్టీ తరఫున అభ్యర్థిగా లింగమనేని రమేష్ నామినేషన్ దాఖలు చేశారు. అసెంబ్లీ పరిధిలో జరిగిన ఈ నామినేషన్ ప్రక్రియ రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. కూటమి పార్టీలైన జనసేన, తెలుగుదేశం పార్టీ (టీడీపీ), బీజేపీ కలసి ఈ అభ్యర్థిత్వానికి మద్దతు ప్రకటించడం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసింది.

నామినేషన్ పత్రాలపై మొత్తం ఆరుగురు జనసేన ఎమ్మెల్యేలు, ముగ్గురు టీడీపీ ఎమ్మెల్యేలు, ఒక బీజేపీ ఎమ్మెల్యే సంతకాలు చేయడం ద్వారా లింగమనేని రమేష్ అభ్యర్థిత్వాన్ని అధికారికంగా బలపరిచారు. ఈ చర్య కూటమి ఐక్యతను మరింత స్పష్టంగా ప్రతిబింబిస్తోందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.



నామినేషన్ దాఖలు సమయంలో పలువురు కూటమి ఎమ్మెల్యేలు లింగమనేని రమేష్ వెంట హాజరయ్యారు. జనసేన నుంచి పులపర్తి రామాంజనేయులు, బొలిశెట్టి శ్రీనివాస్ నాయకర్, వంశీకృష్ణ శ్రీనివాస్, దేవ వరప్రసాద్, కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్, కాగిత కృష్ణ ప్రసాద్ వంటి నేతలు అక్కడికి చేరుకుని తమ మద్దతును ప్రకటించారు.

అలాగే టీడీపీకి చెందిన నక్కా ఆనంద్ బాబు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బీజేపీ తరఫున ఎన్. ఈశ్వరరావు హాజరై సంతకం చేయడం ద్వారా కూటమి మూడు పార్టీల భాగస్వామ్యాన్ని ఒకే వేదికపై ప్రదర్శించారు. ఈ మొత్తం పరిణామం అసెంబ్లీ ఆవరణలో రాజకీయ వేడిని పెంచింది.

రాజ్యసభ అభ్యర్థిత్వం విషయంలో కూటమి తరఫున సమన్వయం మరింత బలపడిందని ఈ నామినేషన్ ప్రక్రియ ద్వారా స్పష్టమవుతోంది. సాధారణంగా రాజ్యసభ స్థానాల విషయంలో పార్టీ అంతర్గత చర్చలు, సంఖ్యా బలం ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటారు. అయితే ఈసారి మూడు పార్టీల కలయికతో అభ్యర్థిని ముందుకు తేవడం ద్వారా వ్యూహాత్మకంగా ముందడుగు వేసినట్టు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.




# కంటి చూపుకు రక్షణ కవచం

## కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

- **మునుగోడు నియోజకవర్గంలో నిరంతరాయంగా ఉచిత కంటి వైద్య శిబిరాలు**
- **ఇప్పటికే 13 వైద్య శిబిరాలు నిర్వహించి 9766 మందికి పరీక్షలు నిర్వహించి, 2198 మందికి సక్సెస్ ఫుల్ గా కంటి ఆపరేషన్లు చేసి 4227 మందికి కళ్ల జోళ్ల పంపిణీ**
- **నేడే (7-6-2026) మర్రిగూడెం మండల ప్రజలకు 14వ, ఉచిత**

**కంటి వైద్య శిబిరం**
**మునుగోడు వెలుతురు జూన్ 06:**

తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ పేరు మీద మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా ఏ ఒక్కరు కంటి సమస్యలతో బాధపడొద్దనే ఆలోచనతో ఉచిత కంటి వైద్య శిబిరాలకు శ్రీకారం చుట్టారు మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

ఇప్పటివరకు 13 విడతలుగా ఈ ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి 9766 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 2198 మంది కి కంటి ఆపరేషన్లు పూర్తిచేసి 4227 మందికి కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు..

మునుగోడు మండల ప్రజలకు మునుగోడు లో నిర్వహించి న మొదటి విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 216 మందికి, 2వ విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 108 మందికి, చండూరు మున్సిపాలిటీ ప్రజలకు మునుగోడు లో నిర్వహించిన 3వ విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 129 మందికి, నాంపల్లి మండలప్రజలకు నాంపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన 4వ, విడత ఉచిత కంటి వైద్య శిబిరంలో 229 మందికి, మర్రిగూడ మండల కేంద్రంలో నిర్వహించిన 5వ, విడత కంటి వైద్య శిబిరంలో 171 మందికి, చూండురు మండల ప్రజలకు చండూరు మండలం బంగారి గడ్డలో నిర్వహించిన 6వ, విడత వైద్య శిబిరంలో 198 మందికి, ఘట్టుప్పల్ మండల కేంద్రంలో ఘట్టుప్పల్ మండల ప్రజలకు నిర్వహించిన 7వ విడత వైద్య శిబిరంలో 65 మందికి, నారాయణ్ పూర్ మండలంలో నిర్వహించిన 8 వ, విడత వైద్య శిబిరంలో 132 మందికి, చౌటుప్పల్ మున్సిపాలిటీలో నిర్వహించిన 9వ, విడత వైద్య శిబిరంలో 82 మందికి, చౌటుప్పల్ మండలంలో నిర్వహించిన 10వ, విడత వైద్య శిబిరంలో 160 మందికి, మునుగోడు లో మునుగోడు, ఘట్టుప్పల్ మండలాల ప్రజలకు నిర్వహించిన 11వ, విడత వైద్య శిబిరంలో 257 మందికి, మునుగోడు క్యాంపు కార్యాలయం ఆవరణలో చూండరు మున్సిపాలిటీ చండూరు మండల ప్రజలకు నిర్వహించిన 12 వ, విడత వైద్య శిబిరంలో 223 మందికి, మునుగోడు క్యాంపు కార్యాలయ ఆవరణలో నాంపల్లి మండల ప్రజలకు నిర్వహించిన 13 వ, వైద్య శిబిరంలో 228 మందికి కంటి ఆపరేషన్లను పూర్తి చేశారు....

మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా కంటి సమస్యతో బాధపడుతున్న ప్రతి తల్లి, ప్రతి తండ్రి కి పెద్దకొడుకుగా మారి కంటి శస్త్ర చికిత్సలు చేయిస్తున్నారు... రాబోయే రోజుల్లో నియోజకవర్గ వ్యాప్తంగా ఏ ఒక్కరు కూడా కంటి సమస్యతో బాధపడకుండా ఉండాలని ప్రణాళిక రూపొందించారు.. ఆ ప్రణాళికలో భాగంగానే 10 పదివేల మందికి కంటి శస్త్ర చికిత్సలు చేయించేలా టార్గెట్ పెట్టుకున్నారు..

దాంట్లో భాగంగానే నేడు (07-6-2026) ఆదివారం మర్రిగూడెం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 14వ. విడత ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు..తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, ఫీనిక్స్ ఫౌండేషన్, శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఈ ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు.. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉచిత వైద్య శిబిరానికి సంబంధించిన ఏర్పాట్లను స్థానిక నాయకులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు...మర్రిగూడెం మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగపరుచుకోవాలని ఇప్పటికే గ్రామాలలో టామ్ టామ్ వేయించి ప్రచారం నిర్వాహించారు స్థానిక నాయకులు...






## నేడే (7-6-2026) మర్రిగూడ మండల ప్రజలకు ఉచిత కంటి వైద్య శిబిరం

నేడే 7 జూన్ 2026 ఆదివారం రోజు కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మర్రిగూడ మండలం లోని అన్ని గ్రామాల లో నివసించే ప్రజలకు మరో మారు

**ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించబడును**

**ఉచిత వైద్య శిబిరం వేదిక:-**
మర్రిగూడ ప్రభుత్వ పాఠశాల

**సమయం:- ఉదయం 9 గంటల నుండి**

**గమనిక:-**
50 సంవత్సరాల వయసు పైబడిన వారు విధిగా ఆధార్ కార్డుతో పాటు, మీ ఫోన్ నెంబర్,గతంలో మీరు వాడుతున్న మందులను కూడా వెంట తీసుకురాగలరు.

**ముఖ్య గమనిక:-**
కంటి శుక్లాల ఆపరేషన్ అవసరం ఉన్న వారిని వెంటనే హైదరాబాద్ తీసుకెళ్లి ఆపరేషన్ చేయించి తీసుకొస్తారు..

**ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోగలరు**




# గిల్, రాహుల్ సెంచరీలు

## 50వ టెస్టులో పంత్ ఫిఫ్టీ

న్యూ చండీగడ్‌లో భారత బ్యాటర్లు శతక మోగ మోగించారు. ఓపెనర్ కెఎల్ రాహుల్ (100), కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (103 నాటౌట్) శతకాలతో చెలరేగగా.. రిషబ్ పంత్ (50 నాటౌట్), సాయి సుదర్శన్ (81) అర్ధ సెంచరీలతో కదం తొక్కారు. భారత టాప్–5 బ్యాటర్లలో నలుగురు ఫిఫ్టీ ప్లస్ పరుగులు చేయటంతో అఫ్గనిస్తాన్‌తో ఏకైక టెస్టు తొలి రోజు ఆతిథ్య భారత్ పైచేయి సాధించింది. తొలి రోజు ఆట ముగిసేసరికి భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 368/3తో నిలిచింది.

న్యూ చండీగడ్

శుభ్‌మన్ గిల్ (103 నాటౌట్, 143 బంతుల్లో 1 ఫోర్లు, 1 సిక్స్) అజేయ సెంచరీతో చెలరేగగా, రిషబ్ పంత్ (50 నాటౌట్, 70 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) అజేయ అర్ధ సెంచరీతో కదం తొక్కాడు. ఓపెనర్ కెఎల్ రాహుల్ (100, 165 బంతుల్లో 11 ఫోర్లు), నం.3 బ్యాటర్ సాయి సుదర్శన్ (81, 104 బంతుల్లో 13 ఫోర్లు) మెరవటంతో అఫ్గనిస్తాన్‌తో ఏకైక టెస్టులో భారత్ భారీ స్కోరు దిశగా సాగుతోంది. తొలి రోజు ఆటలో 85 ఓవర్లలో 3 వికెట్లకు భారత్ 368 పరుగుల భారీ స్కోరు చేసింది. అఫ్గనిస్తాన్ బౌలర్ మహ్మద్ సలీమ్ (2/67) రెండు వికెట్లతో రాణించాడు.

యశస్వి జైస్వాల్ విఫలం

టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న భారత్‌కు ఓపెనర్లు ఆశించిన ఆరంభం ఇవ్వలేదు. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (24) ఐదు ఫోర్లతో దూకుడుగా ఆడినా.. వికెట్ నిలుపుకోలేదు. మరో ఓపెనర్ కెఎల్ రాహుల్ (37), సాయి సుదర్శన్ (32) తొలి సెషన్లో మరో వికెట్ పడకుండా జాగ్రత్త వహించారు. ఇన్నింగ్స్ పదో ఓవర్లో కెఎల్ రాహుల్ వికెట్‌కీపర్ చేతికి చిక్కినా.. అఫ్గనిస్తాన్ రివ్యూ తీసుకోలేదు. దీంతో రాహుల్‌కు జీవనదానం లభించింది. తొలి సెషన్లో 25 ఓవర్లలో భారత్ ఓ వికెట్‌కు 96 పరుగులు చేసింది.

రాహుల్, సాయి సుదర్శన్ మెరుపుల్

లంచ్ విరామం తర్వాత కెఎల్ రాహుల్, సాయి సుదర్శన్ బ్యాట్ ఝుళిపించారు. ఐపీఎల్ ఫామ్‌ను సాయి సుదర్శన్ కొనసాగించగా.. రాహుల్ ఓ ఎండ్‌లో నిలబడ్డాడు. 8 ఫోర్లతో 67 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించిన సాయి సుదర్శన్ సెంచరీ దిశగా సాగాడు. కానీ మమ్మద్ సలీమ్ ఓవర్లో వికెట్ల వెనకాల క్యాచౌట్‌గా నిష్క్రమించాడు. కెఎల్ రాహుల్ 7 ఫోర్లతో 86 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించాడు. రెండో సెషన్లో 25 ఓవర్లలో ఓ వికెట్ కోల్పోయిన భారత్ 113 పరుగులు చేసింది. సాయి సుదర్శన్ అవుటవగా.. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (20)తో కలిసి రాహుల్ అజేయంగా నిలిచాడు.

శతక మోత మోగింది

చివరి సెషన్లో పరుగుల మోత మోగింది. 35 ఓవర్లలో అఫ్గాన్ ఓ వికెట్ పడగొట్టగా.. భారత్ 159 పరుగులు పిండుకుంది. కెఎల్ రాహుల్ 11 ఫోర్లతో 164 బంతుల్లో కెరీర్ 12వ సెంచరీ సాధించాడు. సెంచరీ తర్వాత రాహుల్ వికెట్ కాపాడుకోలేదు. కెరీర్ 50వ టెస్టు ఆడుతున్న రిషబ్ పంత్ తోడుగా శుభ్‌మన్ గిల్ నాల్గో వికెట్‌కు అజేయంగా 121 పరుగులు జోడించాడు. ఈ ఇద్దరూ 24.4 ఓవర్లలో 4.9 రన్‌రేట్‌తో పరుగులు సాధించారు. ఏడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 68 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించిన గిల్.. 11 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 138 బంతుల్లో సెంచరీ సాధించాడు. పేలవ ఐపీఎల్ సీజన్ నుంచి కోలుకున్న పంత్ రెండు ఫోర్లు, మూడు సిక్సర్లతో తనదైన శైలిలో అర్ధ సెంచరీ సాధించాడు. మూడు సెషన్లలో అఫ్గాన్ బౌలర్లపై ఆధిపత్యం చెలాయించిన టీమ్ ఇండియా తొలి రోజు తిరుగులేని స్థితిలో నిలిచింది.

స్కోరు వివరాలు :

భారత్ తొలి ఇన్నింగ్స్ : యశస్వి జైస్వాల్ (సి) అఫ్సార్ (బి) మహ్మద్ సలీమ్ 24, కెఎల్ రాహుల్ (సి) రెహమ్మనుల్లా గుర్జాజ్ (బి) జియార్ రెహమాన్ 100, సాయి సుదర్శన్ (సి) అఫ్సార్ జజాయ్ (బి) మహ్మద్ సలీమ్ 8, శుభ్‌మన్ గిల్ నాటౌట్ 103, రిషబ్ పంత్ నాటౌట్ 50, ఎక్స్‌ట్రాలు : 10, మొత్తం : (85 ఓవర్లలో 3 వికెట్లకు) 368.

వికెట్ల పతనం : 1–41, 2–180, 3–247.

బౌలింగ్ : జియార్ రెహమాన్ 15–2–61–1, అజ్మతుల్లా ఓమర్‌జాయ్ 14–3–42–0, మహ్మద్ సలీమ్ 13–1–67–2, నాంగేయాలియ ఖరొటె 20–0–95–0, అబ్దుల్ మాలిక్ 6–0–37–0, హస్మతుల్లా షాహిది 17–0–61–0.

భారత్ తొలి ఇన్నింగ్స్ 368/3



# ‘సుధీర్ జోకర్` పక్కా కమర్షియల్

సుడిగాడి సుధీర్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా ‘సుధీర్స్ జోకర్`. బిగ్ బాస్ ఫేమ్ అయేషా ఈ చిత్రంతో హీరోయిన్ గా పరిచయం కాబోతోంది. ఈ చిత్రంలో అభిరామి, మురళీ శర్మ, అజయ్ ఘోష్, రమేష్ ఇందిరా, విష్ణు ఓయ్, మురళీధర్ గౌడ్ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

ఈ చిత్రాన్ని విజయ్ దొంకాడ, శ్రీధర్ మక్కువ నిర్మిస్తున్నారు. పీఎస్ సునీల్ పుప్పాల దర్శకత్వం వహిస్తున్నారు.

శనివారం హీరోయిన్ అయేషా పుట్టినరోజు సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు చెబుతూ బర్త్ డే స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. ఈ చిత్రంలో ఆమె షాలినీ అనే క్యారెక్టర్ లో తన అందంతో పాటు పర్ఫార్మెన్స్తో ప్రేక్షకుల్ని అలరించ బోతోంది. రీసెంట్ గా హీరో సుడిగాలి సుధీర్ బర్త్ డే సందర్భంగా రిలీజ్ చేసిన మూవీ బ్యాంగర్ కు హ్యూజ్ రెస్పాన్స్ దక్కింది. ఒక ఇంట్రెస్టింగ్ కమర్షియల్ ఎంటర్ టైనర్ చూడబోతున్నామనే అంచనాలు ఈ మూవీపై ఏర్ప డుతున్నాయి. ఈ చిత్రానికి ప్రొడక్షన్ డిజైనర్ – విఠల్ కోసనం,కాస్ట్యూమ్ డిజైనర్ – చిన్మయి కకిలేటి, ఎడిటర్ – ధర్మేంద్ర కాకర్ల, సినిమాటోగ్రఫీ – అహ్మద్ షెరీఫ్, మ్యూజిక్ – లియోన్ జేమ్స్, ప్రొడ్యూసర్స్ – విజయ్ దొంకాడ, శ్రీధర్ మక్కువ, స్క్రిప్ట్, డైరెక్షన్ – పీఎస్ సునీల్ పుప్పాల.

# మధురమైన పాటలకు వేదిక

సీన్ సెటర్స్, అసెంబ్లీ సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక సంగీత వేదుక ‘ది నైట్ ఆఫ్ ది స్టార్స్ఈ నెల 12న హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ అసెంబ్లీలో జరగనుంది. సంగీత దర్శకుడు కళ్యాణి మాలిక్, నేపథ్య గాయని గీతా మాధురి, సాకేత్, వినూత్న, కశ్యప్, అదితి, భార్గవి తమ అద్భుతమైన సంగీత ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించనున్నారు. యూట్యూబర్ నిఖిల్ విజయేంద్ర సింహా ఈ వేదుకని ఆర్గనైజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా నిఖిల్ విజయేంద్ర సింహా మాట్లాడుతూ,'మనందరం చిన్నప్పటి నుంచి పాటలను మధురమైన జ్ఞాపకాలుగా, నోస్టాల్జిక్ ఫీలింగ్స్‌గా ఆస్వాదిస్తూ పెరిగాం. ఆ నోస్టాల్జిక్ పాటలను మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. దాదాపు 23 సంవత్సరాల తర్వాత కళ్యాణి మాలిక్ ఆధ్వర్యంలో ఈ మ్యూజికల్ లైవ్ షో జరగడం చాలా సంతోషంగా ఉంది అని తెలిపారు.



‘నా మొదటి సినిమా ‘ఐతేవిడుదలైనప్పుడు ఎంత ఆనందంగా, ఉత్సా హంగా ఫీలయ్యానో, ఈ షో నిర్వహి స్తున్నప్పుడు కూడా అదే భావన కలుగు తోంది అని కళ్యాణి మాలిక్ చెప్పారు. గాయని గీతా మాధురి మాట్లాడుతూ,'కళ్యాణి మాలిక్ మొదటిసారిగా నిర్వహిస్తున్న ఈ షో గురించి నాకు చాలా కాల్స్ వస్తున్నాయి. అందరూ ఈ కార్యక్రమం గురించి ఆసక్తిగా అడుగుతున్నారు. కళ్యాణి పాటలకు ఎంతో మంది అభిమానులు ఉన్నారు. నాకు లైవ్ మ్యూజిక్ షోలు అంటే చాలా ఇష్టం. అలాంటి ప్రత్యేకమైన కార్యక్రమంలో భాగం కావడం చాలా ఆనందంగా ఉంది` అని అన్నారు.

# తిరు రూపంలో రామ్ సినిమాకి విజువల్ ట్రీట్



దర్శకుడిగా హీరో రామ్ పోతినేని తన కెరీర్‌లో మరో కొత్త ప్రయా ణానికి శ్రీకారం చుట్టారు. తన 23వ చిత్రంతో ఆయన దర్శకుడిగా ఆరంగేట్రం చేస్తున్నారు.

రామ్ పుట్టినరోజు సందర్భంగా ఈ ప్రాజెక్ట్ ప్రకటించి నప్పటి నుంచే సినీ వర్గాలు, అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది.

ఇటీవల విడుదలైన ‘వీర’ ఫస్ట్ గ్లింప్స్‌తో అంచనాలు మరింత పెరిగాయి. ఇప్పుడు ఆ ఉత్సాహాన్ని మరింత పెంచుతూ జాతీయ అవార్డు గ్రహీత, ప్రముఖ సినిమాటో గ్రాఫర్ తిరునావుకరసు (తిరు) ఈ చిత్రానికి డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీగా జాయిన్ అయ్యారు. ఈ చిత్రంతో రామ్ రచయిత–దర్శకుడిగా పరిచయం అవుతున్నారు.



# భావోద్వేగభరిత ప్రేమకథ

హర్ష్ రోషన్, నక్షత్ర జంటగా అరుణాచల క్రియేషన్స్ బ్యానర్ మీద కృష్ణ కొమ్మలపాటి నిర్మిస్తున్న చిత్రానికి ‘తెల్ల కాగితం’ అనే టైటిల్‌ను ఫిక్స్ చేశారు. రమేష్ బండ్రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. ‘కోర్ట్’, ‘బ్యాండ్ మేళం’ వంటి విజయాల తరువాత హర్ష్ రోషన్ చేస్తున్న ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన అప్డేట్, టైటిల్, ఫస్ట్ లుక్‌ను తాజాగా రిలీజ్ చేశారు. యూత్ ఫుల్ ఎమోషనల్ లవ్ స్టోరీగా ఈ మూవీ రాబోతోందని టైటిల్, ఫస్ట్ లుక్‌ని చూస్తేనే తెలుస్తోంది. పోస్టర్‌లో హీరో హీరోయిన్లు కనిపిస్తున్న, చుట్టూ ఉన్న విజువల్స్ చూస్తే ఇదొక అందమైన ప్రేమ కథా చిత్రమని అర్థం అవుతోంది. ఆహ్లాదకరమైన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేసి సినిమా మీద అంచనాలు పెంచేశారు.

ఈ రొమాంటిక్ ఎంటర్టైనర్‌ను సరికొత్తగా మలిచి ప్రేక్షకులకు ఓ కొత్త ఎక్స్‌పీరియెన్స్‌ను ఇవ్వాలని దర్శకుడు రమేష్ బండ్రెడ్డి ప్రయత్నిస్తున్నారు. ఈ సినిమాకి కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు : నందు సవిరిగన, డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ: కె.వి.గుహన్, సంగీతం: విజయ్ బుల్గానిన్, ఎడిటర్: కార్తీక శ్రీనివాస్ ఆర్, ప్రొడక్షన్ డిజైనర్: చిన్నా, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రవి సూర్నెడ్డి, కొరియోగ్రఫీ: ఈశ్వర్ పెంటి.

# ఆసక్తికరంగా ‘ది ఎండ్ ఎఫ్ ఓక్ స్ట్రీట్`

ఒక రహస్యమైన ఖగోళ సంఘటన ఓక్ స్ట్రీట్‌ను శివారు ప్రాంతం నుండి వేరు చేసి, వారి నివాస ప్రాంతాన్ని తెలియని ప్రదేశానికి తరలిస్తుంది. ఈ నేపథ్యంలో ఓక్ స్ట్రీట్‌కి చెందిన ప్లాట్ కుటుంబం గుర్తుపట్టలేని పరిసరాలలో ప్రయాణిస్తూనే ఉన్నప్పటికీ ఐకమత్యంగా ఉండటాన్ని గమనిస్తారు. ఈ ఐకమత్యంతో వారెలాంటి ప్రయాణం చేశారు?, చివరికి ఏమైంది అనేది ఆద్యంతం ఆసక్తికరం అని మేకర్స్ చెబుతున్నారు.



యాన్ హాతవే, ఇవాన్ మెక్‌గ్రెగర్ ప్రధాన పాత్రలలో నటించిన సినిమా ‘ది ఎండ్ ఆఫ్ ఓక్ స్ట్రీట్’. డేవిడ్ రాబర్ట్ మిచెల్ రచన, దర్శకత్వం వహించగా, జె.జె. అబ్రామ్స్, హన్నా మింగెల్లా, జాన్ కోహెన్, డేవిడ్ రాబర్ట్ మిచెల్, మాట్ జాక్సన్ మరియు టామీ హార్పర్ నిర్మించారు.

క్రిస్ బెండర్, జేక్ వీనర్, జోవాన్ లీ మరియు లీన్ స్టోన్‌బ్రేకర్ ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు. ఎ బ్యాడ్ రోబోట్ ప్రొడక్షన్, ఎ జాక్సన్ పిక్చర్స్ ప్రొడక్షన్, ఎ డేవిడ్ రాబర్ట్ మిచెల్ ఫిల్మ్ పతాకాలపై రూపొందిన ఈ చిత్రాన్ని వార్నర్ బ్రదర్స్ పిక్చర్స్ ప్రపంచవ్యాప్తంగా పంపిణీ చేయనుంది. భారతదేశంలో ఆగస్ట్ నెలలో సింగిల్ స్క్రీన్ థియేటర్లు, ఐమాక్స్‌లో ఈ సినిమా విడుదల కానుంది.